RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




హైదరాబాద్ 20 అక్టోంబర్ 2026 మంగళవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:123



ప్రజాబలం

20 అక్టోంబర్ 2026 మంగళవారం

## బ్రెయిన్ డ్రెయిన్ రివర్స్

డొనాల్డ్ ట్రంప్ దెబ్బకు భారత్ టెక్నాలజీ నిపుణులను మళ్లీ స్వదేశం వైపు అడుగులు వేస్తున్నారు. తాజా గణాంకాల ప్రకారం.. 2026 మొదటి తొమ్మిది నెలల్లోనే సుమారు 12,700 మంది వైట్-కాలర్ టెక్ నిపుణులు అమెరికా నుంచి భారతదేశానికి తిరిగొచ్చారు. గత కొన్ని ఏళ్లుగా పెరుగుతున్న ఈ ధోరణి పెరుగుతోంది. 2023లో 7,200, 2024లో 9,800, 2025లో 15,100 తిరిగి రాగా ఈ ఏడాది ఆల్-టైమ్ రికార్డు నమోదు చేసే దిశగా పయనిస్తోంది. స్వదేశానికి తిరిగొస్తున్న వారిలో అధికులు హైదరాబాద్, బెంగళూరు, పూణే, గుర్గావ్ వంటి ప్రధాన టెక్ నగరాల్లో ఉపాధి అవకాశాల కోసం ప్రయత్నిస్తున్నారు.ఈ భారీ రివర్స్ బ్రెయిన్ డ్రెయిన్‌కు కారణం హెచ్-1బి వీసా నిబంధనల్లో పెరిగిన అనిశ్చితి, గ్రీన్ కార్డ్ కోసం దశాబ్దాల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితులు , అమెరికా ప్రధాన కంపెనీల్లో సాగుతున్న నిరంతర లేఆఫ్‌లు కారణమని చెబుతున్నారు. వర్క్ వీసాలు పునరుద్ధరణ కాకపోవడం , ఉద్యోగం పోయిన 60 రోజుల్లోగా కొత్త ఉద్యోగం లభించకపోవడంతో ఎంతోమంది అనివార్యంగా స్వదేశానికి తిరిగొస్తున్నారు. దీనికి తోడు, అమెరికాలో పెరిగిన జీవన వ్యయం, పిల్లల భవిష్యత్తు, కుటుంబ అవసరాలు కూడా ఈ నిర్ణయానికి ప్రధాన కారణాలుగా మారుతున్నాయి.భారత్‌లోని గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు , బహుళజాతి ఐటీ కంపెనీలు అమెరికా అనుభవం ఉన్న నిపుణులను ఆహ్వానిస్తున్నప్పటికీ, ఇక్కడి మార్కెట్ వారికి కొత్త సవాళ్లను విసురుతోంది. స్వదేశానికి వచ్చిన టెక్నీషియన్లు అమెరికాలో పొందిన జీతాలతో పోలిస్తే దాదాపు 65% నుంచి 75% వరకు తక్కువ వేతనాన్ని అంగీకరించాల్సి వస్తోంది. అంతేకాకుండా, ఇప్పటికే దేశీయంగా అందుబాటులో ఉన్న అనుభవజ్ఞులైన స్థానిక టెక్ నిపుణులతో వీరు తీవ్ర పోటీని ఎదుర్కోవాల్సి వస్తోంది.ఏది ఏమైనప్పటికీ, ఈ రివర్స్ బ్రెయిన్ డ్రెయిన్ భారత ఐటీ , స్టార్టప్ రంగానికి సరికొత్త శక్తినందిస్తుందని నిపుణులు భావిస్తున్నారు. గ్లోబల్ ప్రాజెక్టులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , క్లౌడ్ టెక్నాలజీల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న నిపుణులు స్వదేశానికి రావడం వల్ల భారతీయ కంపెనీలకు మేధో సంపత్తి, అంతర్జాతీయ అనుభవం లభిస్తాయి. భారత్‌ను గ్లోబల్ టెక్ హబ్‌గా మార్చే దిశగా ఈ పరిణామం కీలకమైన మలుపుగా మారనుంప్రపంచ టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ తాజాగా చేసిన వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ రంగంలో ఆందోళన కలిగిస్తున్నాయి. కంపెనీ ఏఐ విభాగం చీఫ్ ముస్తఫా సులేమాన్ ప్రకారం రాబోయే 12 నుంచి 18 నెలల్లో అనేక వైట్ కాలర్ ఉద్యోగాలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పూర్తిగా ఆటోమేట్ చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇప్పటివరకు అధిక నైపుణ్యం అవసరమయ్యే కార్యాలయ పనులు, భవిష్యత్తులో నేరుగా ఏఐ వ్యవస్థల ద్వారా నిర్వహించబడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా న్యాయపరమైన సేవలు, అకౌంటింగ్, మార్కెటింగ్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి వంటి రంగాలు భారీ మార్పులను ఎదుర్కొనే అవకాశముందని టెక్ నిపుణులు చెబుతున్నారు.సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో యంత్రాల సమస్య పరిష్కార సామర్థ్యం, కోడింగ్ వేగం, డేటా విశ్లేషణ కచ్చితత్వం మానవుల స్థాయిని దాటుతున్నాయని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం అనేక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు తమ కోడ్‌లో గణనీయమైన భాగాన్ని ఏఐ సహాయంతోనే రూపొందిస్తున్నారని నివేదికలు సూచిస్తున్నాయి. బిజినెస్ ఇన్‌సైడర్ కథనం ప్రకారం ఏఐ వినియోగం చిన్న పనులకే పరిమితం కాకుండా, సంక్లిష్టమైన కార్పొరేట్ ప్రక్రియలను కూడా నిర్వహించే దిశగా వేగంగా విస్తరిస్తోంది. భవిష్యత్తులో కంపెనీల్లో ఏఐ ఏజెంట్లు అనే స్వతంత్ర వ్యవస్థలు ప్రవేశించి, మానవ జోక్యం లేకుండానే పనులను పర్యవేక్షించడం, విశ్లేషించడం, వ్యాపార నిర్ణయాలు తీసుకోవడం వంటి బాధ్యతలను నిర్వహించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.ఇప్పటివరకు ఏఐ అనేది ఉద్యోగులను సాయపడే ఒక సాధనంగా మాత్రమే భావించబడింది. అయితే ఇప్పుడు అది నేరుగా మానవ ఉద్యోగాల స్థానాన్ని భర్తీ చేసే దిశగా అడుగులు వేస్తోందనే అభిప్రాయం బలపడుతోంది. ముఖ్యంగా కంప్యూటర్ ఆధారిత పనులు చేసే ఉద్యోగులపై దీని ప్రభావం ఎక్కువగా ఉండొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇక ఏఐ రంగంలో ఆధిపత్యం కోసం మైక్రోసాఫ్ట్ భారీ వ్యూహాలతో ముందుకు సాగుతోంది. సంస్థ తన సొంత ఫౌండేషన్ ఏఐ మోడళ్ల అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నట్లు సమాచారం. భవిష్యత్తులో ఒక ఏఐ వ్యవస్థను రూపొందించడం, ప్రస్తుతం బ్లాగ్ రాయడం లేదా పాడ్‌కాస్ట్ రూపొందించడం ఎంత సులభమో అంత సులభంగా మారవచ్చని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. టెక్నాలజీ విప్లవం వేగంగా జరుగుతున్న ఈ సమయంలో, ఉద్యోగ రంగం కూడా పెద్ద మార్పులకు సిద్ధమవుతోంది. కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడం, ఏఐతో కలిసి పనిచేసే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం భవిష్యత్తులో ఉద్యోగ భద్రతకు కీలకమవుతుందని నిపుణులు సూచిస్తున్నారు.దేశంలో వైట్ కాలర్ ఉద్యోగుల నియామకాలు పెరిగాయి. గత ఆగస్టు నెలలో బలమైన వృద్ధిని నమోదు చేసినట్లు ప్రముఖ జాబ్స్ పోర్టల్ నౌకరీ.కామ్ నివేదిక వెల్లడించింది. వార్షిక ప్రాతిపదికన అంటే గతేడాది ఆగస్టు నెలతో పోలిస్తే ఈ ఏడాది ఆగస్టులో 14 శాతం నియామకాలు పెరిగినట్లు రిపోర్ట్ తెలిపింది. గతేడాది ఆగస్టులో జాబ్ స్పీక్ సూచీ 2664గా ఉండగా అది ఈ ఆగస్టు నాటికి 3028కి పెరిగినట్లు వెల్లడించింది. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో నియామకాలు జోరు అందుకున్నాయని తెలిపింది.తమ ప్లాట్ ఫామ్‌లో ఉద్యోగ సెర్చ్ ఆధారంగా నెలవారీ రిపోర్టును నౌకరీ డాట్ కామ్ రూపొందించింది. ఆటో రంగంలో రికార్డ్ స్థాయిలో 19 శాతం వరకు వైట్ కాలర్ ఉద్యోగ నియామకాలు జరిగినట్లు తెలిపింది. ఆ తర్వాత హెల్త్ కేర్ రంగంలో 16 శాతం, రిటైల్ రంగంలో 15 శాతం, ఇన్సూరెన్స్ రంగంలో 12 శాతం, ఐటీ రంగాల్లో 11 శాతం మేర నియామకాలు జరిగాయని తెలిపింది. సాఫ్ట్‌వేర్ రంగం పుంజుకోవడం, నాన్- ఐటీ రంగాలు విస్తరించడమే ఉద్యోగ నియామకాలు పెరిగేందుకు కారణమని నౌకరీ నివేదిక పేర్కొంది.

## గిరిజన బాలుర పోస్ట్ మెట్రిక్ హాస్టల్ నిర్మాణానికి మంత్రి పొంగులేటి శంకుస్థాపన





**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 19:**మున్సిపాలిటీ పరిధిలోని టీఎన్జీవోస్ కాలనీ (22వ వార్డు)లో రూ. 2.5 కోట్లతో నిర్మించే గిరిజన సంక్షేమ శాఖ బాలుర పోస్ట్ మెట్రిక్ హాస్టల్ భవన నిర్మాణానికి.. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం రాత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర.టీఎస్ తో కలిసి మాట్లాడుతూ.. త్వరలోనే బాలికల హాస్టల్ నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేస్తామని హామీ ఇచ్చారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి మన ప్రజా ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని అన్నారు. అనంతరం... ముత్తగూడెం గ్రామంలో దేవీ నవరాత్రి ఉత్సవాల మండపం వద్ద అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ.. దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో.. ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కాఫర్ డ్యాం నిర్మించి ప్రాణహిత నీటిని మళ్లించాలి
## ఒక్కసారి కరువు వచ్చిందంటే చాలా ఇబ్బందులు పడాలి కవిత







కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కన్నేపల్లి (లక్ష్మీ) పంపు హౌస్ వద్ద ప్రాణహిత ప్రవాహాన్ని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు.కాఫర్ డ్యాం నిర్మించి ప్రాణహిత నీటిని మళ్లించాలి.నవంబర్ నెలాఖరులోగా కాఫర్ డ్యాం నిర్మించుకుంటే కన్నేపల్లి పంపు హౌస్ వద్ద ఆందోళన చేస్తాం. మేడిగడ్డను బూచీగా చూపి రైతులకు నష్టం చేయవద్దు.ప్రశ్నించి, పోరాడటమే కాకుండా ప్రభుత్వానికి పరిష్కార మార్గాలను చెబుతున్నామని అన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులు చాలా బాధలో ఉన్నారు. నిజానికి మన తెలంగాణలో ఉన్న రెండు పెద్ద నదులు గోదావరి, కృష్ణా నీళ్లను సరిగా వాడుకుంటే మనకు కరువు అనే పరిస్థితే ఉండదు.మనం తెలంగాణ కోసం పిడికిలి ఎత్తి ఉద్యమం చేసింది కూడా మా నీళ్లు మాకు కావాలనే. నీ తెలంగాణ వచ్చాక మన నీటిని సంపూర్ణంగా వాడుకున్నామా అంటే వాడుకోలేదు.తెలంగాణ ఏర్పడిన తర్వాత వానలు సరైన టైమ్ కి రావటంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా టైమ్ గడిచిపోయింది. బీఆర్ఎస్ టైమ్ లో కృష్ణా నది ప్రాజెక్ట్ ల పై కొంత పనులు చేసి 4 నుంచి 5 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చారు. ??ఉత్తర తెలంగాణలో ఎస్సారెస్పీ, కడెం, అప్పర్ మానేరు, మిడ్ మానేరు, లోయర్ మానేరు కు నీళ్లు ఇస్తూ 37 లక్షల ఎకరాలను స్థిరీకరణ చేసే ప్రయత్నం చేశారని అన్నారు.

మొత్తంగా లక్షా 80 వేల కోట్లు ఖర్చు చేసి స్థిరీకరణ మాత్రమే చేశారు. కాళేశ్వరంలో కొత్తగా లక్ష ఎకరాలకు మాత్రమే నీళ్లు ఇచ్చారు. ఈ విషయం మనం చెబితే బీఆర్ఎస్ సోషల్ మీడియాలో మనపై దాడి చేస్తారు. కానీ నిజాలు మారవు. వాస్తవాలు కచ్చితంగా కఠినంగానే ఉంటాయి. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇంకా ఘోరంగా పరిస్థితి తయారైంది. రూ. 26 వేల కోట్లు ఖర్చు చేసి కొత్త ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదు. అడిగితే బకాయిలు చెల్లించామని చెబుతున్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్, దళిత బంధు లాంటి బకాయిలు చెల్లించకుండా ఇవే ఎందుకు చెల్లించినట్టు. ఇప్పుడు మనం ఉన్న ఈ ప్రాణహిత నది వద్ద ఎంత కరువు పరిస్థితులు ఉన్న సరే రోజుకు 2 టీఎంసీల నీళ్లు పోతుంటాయి. వీటిని సరిగా వాడుకుంటే మన రైతుల పొలాలకు నీళ్లు మంచిగా ఇవ్వొచ్చు. అందుకే ఈ ప్రభుత్వానికి ఒక ప్రపోజల్ ఇస్తూ సమస్య పరిష్కారానికి సూచనలు చేస్తున్నాం. మేము పార్టీ పెట్టిన కొత్తలో కూడా కృష్ణానది నీళ్లకు సంబంధించి నార్లపూర్ వద్ద రిజర్వాయర్ గురించి సొల్యూషన్ చెప్పాం. ఇప్పుడు కూడా కన్నెపల్లి పంప్ హౌస్ వద్ద 93 మీటర్ల పైన కాఫర్ నిర్మిస్తే సమస్య పరిష్కరించవచ్చు. మేడిగడ్డకు సంబంధం లేకుండా ఇక్కడ నుంచి అన్నారం, సుందిళ్లకు నీళ్లను ఎత్తిపోయవచ్చు. ఈ నీళ్ల ద్వారా ప్రతి ప్రాజెక్ట్ ను రీఛార్జ్ చేసుకోవచ్చు. రూ. 25 కోట్లు ఖర్చు పెడితే నెలన్నర రోజుల్లో ఈ పనులు పూర్తి చేయవచ్చు. ఎల్ నినో పరిస్థితుల కారణంగా వచ్చే ఏడాది కూడా వానలు పడుతాయో లేదో అని చెబుతున్నారు. కానీ ఇప్పుడు మన కళ్ల ముందే రోజు 2 టీఎంసీల నీళ్లు పోతున్న వాడుకోవటం లేదు. ఈ విషయంలో రైతుల కోసం ప్రభుత్వానికి వినమ్రంగా విజ్ఞప్తి చేస్తున్నాం. ఒకవేళ ఈ ప్రభుత్వం వినకపోతే వారికి ఎలా చెప్పాలో కూడా మాకు తెలుసని అన్నారు.

తెలంగాణలో కోటి 36 లక్షల సాగు భూమి ఉంటే ఈ సారి కోటి 10 లక్షల ఎకరాలు సాగైంది. ఇప్పుడు పంట చివరి దశలో ఉంది. రైతులకు నీళ్లు, కరెంట్ అవసరం ఉంది, అందుకే మేము ఇప్పటికే ప్రభుత్వాన్ని అడుక్కొనైనా, కొనుక్కవచ్చైనా కరెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశాం. మేము డిమాండ్ చేసిన తర్వాతే ముఖ్యమంత్రి స్పందించి కేంద్రాన్ని కరెంట్ అడుగుతామని చెప్పారు. సమస్యపై పోరాటం చేయటమే కాకుండా సొలుష్యన్ కూడా చెప్పాం. కాళేశ్వరం కోసం దాదాపు 93 వేల కోట్లు ఖర్చు పెట్టి కొత్తగా లక్ష ఎకరాలకు మాత్రమే నీళ్లు ఇచ్చారు. కాళేశ్వరం నీళ్లను ఇచ్చేందుకు కాలువలు తవ్వకపోవటంతో కొత్త గా 19 లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వటం సాధ్యం కావటం లేదు. కాలువలను పూర్తి చేయాలంటే మరో 50 వేల కోట్లు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి. ఈ ప్రభుత్వం ఇప్పుడు ఎలాగు అంత ఖర్చు చేసే పరిస్థితిలో లేదని అన్నారు.

ఇప్పటికే ఎల్లంపల్లి సహా అన్ని రిజర్వాయర్లలో నీళ్లు అడుగంటాయి. ఎల్లంపల్లిలో ఉన్న నీళ్లను తాగునీటి కోసం అని స్టోర్ చేశారు. రానున్న పదినెలలు మనం భయంకరమైన పరిస్థితులు చూడాల్సి ఉంటుంది. ఇప్పటికే 21 వేల చెరువులు ఎండిపోయి ముదిరాజ్, బెస్త సోదరులకు ఈ ఏడాది పనిలేని పరిస్థితి వచ్చింది. ఒక్కసారి కరువు వచ్చిందంటే చాలా ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. అందుకే ఆ పరిస్థితిని ఎదుర్కొనేందుకు మేము చేస్తున్న మంచి సూచనను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని అన్నారు.

## వనపర్తిలో బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ.
## ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా ఎమ్మెల్యే.తూడి మేఘారెడ్డి.

వనపర్తి .అనారోగ్యంతో బాధపడుతున్న వారికి పరామర్శ.మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి.వనపర్తి పట్టణం మరియు రాజనగరం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్నవారిని, వివిధ ప్రమాదాలు, ఇతర కారణాలతో మృతి చెందినవారి కుటుంబాలను వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి సోమవారం పరామర్శించారు.బాధితుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకోవడంతో పాటు, మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.వనపర్తి పట్టణంలోని 18వ వార్డుకు చెందిన సాక్షి రిపోర్టర్ రాజు భార్య జి. సంధ్య గుండె సంబంధిత వ్యాధితో శస్త్రచికిత్స చేయించుకున్న నేపథ్యంలో ఆమెను ఎమ్మెల్యే పరామర్శించారు.ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ఎలాంటి ఆందోళన చెందవద్దని, తాను అండగా ఉంటానని రాజు కి భరోసా ఇచ్చారు.అనంతరం పట్టణంలోని 5వ వార్డుకు చెందిన నరసింహ కుమారుడు రవి మృతి చెందడంతో వనపర్తి జిల్లా ఆసుపత్రిలో కుటుంబ సభ్యులను పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు.13వ వార్డుకు చెందిన రాజారెడ్డి గారు గుండె శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.అదే వార్డుకు చెందిన కురుమయ్య కుమారుడు ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందడంతో స్థానిక కౌన్సిలర్ పరుశురాముతో వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యే, బాధిత కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.పట్టణంలోని 14వ వార్డుకు చెందిన బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థిని సోనా ఇటీవల నాదర్‌గుల్‌లోని ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో దాండియా కార్యక్రమం సందర్భంగా లైటింగ్ నిర్మాణం ప్రమాదవశాత్తు కూలిపోవడంతో మృతి చెందింది.ఆమె మృతదేహాన్ని వనపర్తిలోని నివాసానికి తీసుకురావడంతో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను పరామర్శించి, సోనా మృతదేహానికి నివాళులర్పించారు.అనంతరం రాజనగరంలో గుండేటి సురేష్ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.సురేష్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.రాజనగరం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు గొడుగు వెంకటయ్య ముదిరాజ్ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో ఎమ్మెల్యే ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు.ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పట్టణ అధ్యక్షులు కదిరె రాములు, మార్కెట్ యార్డ్ మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు వెంకటేష్, అరుణ బ్రహ్మచారి, పాకనాటి కృష్ణయ్య, బి కృష్ణయ్య, ఏర్పుల రవి, రాజు, రఘు యాదవ్, పరుశురాములు, పాల రవి, మైనార్టీ నాయకులు బషీర్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 20 అక్టోబర్ 2026 మంగళవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:123



## విజయదశమి - దసరా శుభాకాంక్షలు



## ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ను ప్రారంభించిన సీఎం రేవంత్

ఇబ్రహీంపట్నంలో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ను ప్రారంభించిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి
తెలంగాణ అభివృద్ధిలో మరో కీలక ముందడుగు --
ఆధునిక సాంకేతికత, ప్రజల భద్రత, మెరుగైన పోలీసు సేవలకు ప్రాధాన్యం
ముఖ్యమంత్రికి పోలీసుల గౌరవ వందనం --
ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని కమిషనరేట్ కార్యాలయాన్ని పరిశీలించిన సీఎం
ముఖ్యమంత్రికి స్వాగతం పలికి, కమిషనరేట్ ప్రాంగణాన్ని స్వయంగా చూపించిన
పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి, ఐపీఎస్
ప్రారంభోత్సవానికి డీజీపీ సీ.వి. ఆనంద్, డీజీ అభిలాషా బిష్త్, డీజీపీ మహేశ్ భగవత్, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకరయ్య, ప్రకాష్ గౌడ్, సీనియర్ పోలీసు అధికారులు హాజరు



వార్తా 5 లో

## అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తాం

చివరి లబ్ధిదారుడి వరకు ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ.. ఇదే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
ఆర్థిక ఇబ్బందులెదురైనా సంక్షేమ పథకాల అమలు ఆగదు
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నిరంతరాయంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
పాలేరు నియోజకవర్గం కూసుమంచిలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీకి శ్రీకారం చుట్టిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
రాష్ట్ర ప్రజలందరికీ దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపిన శీనన్న

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 19:** తెలంగాణలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరంతరాయంగా కొనసాగుతుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు అందించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుందని, చివరి అర్హుడైన లబ్ధిదారుడికి కూడా న్యాయం జరిగే వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

దసరా పండుగను పురస్కరించుకొని తన సొంత నియోజకవర్గమైన పాలేరులోని కూసుమంచి క్యాంపు కార్యాలయంలో సోమవారం కూసుమంచి మండలానికి చెందిన రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంత్రి మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.



మిగతా 4 లో

## పారదర్శక రెవెన్యూ సేవలు, రైతులకు చట్టబద్ధమైన భూ హక్కులు

భూవివాదాల శాశ్వత పరిష్కారం లక్ష్యంగా రెవెన్యూ వ్యవస్థ పునర్నిర్మాణం
భూభారతితో ఏళ్లనాటి భూ సమస్యలకు పరిష్కారం
34 నెలల్లో 12.40 లక్షల పాస్‌బుక్కుల జారీ
మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్ :- ప్రజలకు మెరుగైన, పారదర్శక రెవెన్యూ సేవలు, రైతులకు చట్టబద్ధమైన భూ హక్కులు, భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా రెవెన్యూ వ్యవస్థను పునర్నిర్మిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ , హౌసింగ్ , సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత ప్రభుత్వంలోని పెద్దల నిర్లక్ష్యం, నిర్వాకం, స్వార్థపూరిత నిర్ణయాల వల్ల పదేళ్లలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా అస్థవ్యస్తమైందని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సూచనలు సలహాల మేరకు రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రజలకు చేరువ చేస్తున్నామని తెలిపారు.

మిగతా 4 లో



## ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల వినియోగంలో వేగం పెంచాలి

ఆర్థిక సంస్కరణలు, వనరుల సమీకరణ, రుణాల పునర్వ్యవస్థీకరణపై ప్రత్యేక దృష్టి
నిధుల వినియోగ పురోగతిపై శాఖల వారీగా సమీక్షించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి బడ్జెట్‌లో కేటాయించిన సబ్‌ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించడానికి వేగం పెంచాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. కేటాయింపులకు అనుగుణంగా నిధుల వ్యయాన్ని వేగవంతం చేయడంతోపాటు, నిధుల వినియోగంలో వెనుకబడిన శాఖలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మరోవైపు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు ఆర్థిక శాఖలో సంస్కరణలు, ఆదాయ వనరుల సమీకరణ, రుణాల పునర్వ్యవస్థీకరణపై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సోమవారం ఆర్థిక శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో భట్టి విక్రమార్క ఎస్సీ, ఎస్టీ ప్రోగ్రెస్ సబ్‌ప్లాన్ అమలు, శాఖల వారీగా బడ్జెట్ కేటాయింపులు, ఇప్పటివరకు జరిగిన వ్యయం, రాష్ట్ర ఆర్థిక నిర్వహణకు సంబంధించిన అంశాలను సమీక్షించారు. కేటాయించిన నిధులు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ఖర్చుయ్యేలా సంబంధిత శాఖలు బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు.



మిగతా 4 లో

## సిద్దిపేట పట్టణం అద్దంల మెరిస్తుంది అంటే మీరే అలంకారం..

## మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

సిద్దిపేట స్వచ్ఛత వెనుక పారిశుధ్య కార్మికుల రెక్కల కష్టమే ఉంది కాంగ్రెస్ పాలనలో పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికుల జీతాలు పెంచాల్సిందే దసరా వేడుకల్లో మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్. సిద్దిపేటకు దేశంలోనే స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు వచ్చాయంటే అది తన గొప్పతనం కాదు చలిని, వానను లెక్కచేయకుండా చీపురు పట్టి శ్రమించిన మున్సిపల్ పారిశుధ్య కార్మికుల రెక్కల కష్టమే.నాడు కాంగ్రెస్ హయాంలో రూ. 8,300 ఉన్న జీతాన్ని బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ రూ. 16,600 కు పెంచారు మధ్యవర్తులు, కాంట్రాక్టర్లను తొలగించి కార్మికులకే నేరుగా గ్రూపుల ద్వారా జీతాలు అందేలా చేశాం

మిగతా 4 లో

# పారదర్శక రెవెన్యూ సేవలు, రైతులకు చట్టబద్ధమైన భూ హక్కులు

**మొదటి పేజీ తరువాయి**

సోమవారం నాడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. భూభారతి చట్టం అమలు, రైతులకు పట్టాదారు పాస్‌బుక్కుల పంపిణీ, రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన భూముల రీ-సర్వే, భూ సమస్యల పరిష్కారం, ఇటీవల తీసుకున్న కీలక నిర్ణయాల అమలు తీరును సుదీర్ఘంగా సమీక్షించారు. ప్రజలకు రెవెన్యూ సేవలు మరింత పారదర్శకంగా, వేగంగా అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో మరింత బాగా పనిచేయాలని ఆదేశించారు.

ప్రజలు కోరిన భూవివాదాలు లేని తెలంగాణ ఉండాలన్న సంకల్పంతో చారిత్రాత్మకమైన భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని ఈ చట్టం అమలులోకి వచ్చిన ఏప్రిల్ 14, 2025 నుంచి ఇప్పటి వరకు 5,68,858 పాస్ బుక్కులు జారీ చేశామని అలాగే ఈ చట్టానికి ముందు 6,71,508 మొత్తం ఈ 34 నెలల్లో 12,40,366 పాస్ బుక్ లను రైతులకు అందజేయడం జరిగిందని చెప్పారు.

దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు భూభారతి చట్టంలో పేర్కొన్న విధంగా రీ-సర్వే ద్వారా పరిష్కారం చూపుతున్నామన్నారు. కొన్ని దశాబ్దాలుగా భూమిని సాగు చేస్తున్నా రికార్డుల్లో హక్కులు లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమై ఇబ్బందులు పడుతున్న రైతులకు తమ ప్రభుత్వం అండగా నిలిచి సమగ్ర సర్వే నిర్వహించి వాస్తవ సాగుదారులను గుర్తించి వారికి చట్టబద్ధమైన హక్కులు కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం, నారాయణపురం రెవెన్యూ గ్రామంలో రీ-సర్వే నిర్వహించి గిరిజనులు, గిరిజనేతరుల సమస్యను పరిష్కరించి 906 మంది రైతులకు 1,600 ఎకరాలకుపైగా హక్కులు కల్పించామన్నారు. సూర్యాపేట జిల్లా నూతనకల్, మద్దిరాల మండలాలలో 15 గ్రామాలల్లో రీ-సర్వే ద్వారా 2,400 మంది రైతులకు 3,450ఎకరాలకు పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. దీంతో పట్టాదారు పాస్‌బుక్‌లతో రైతులకు బ్యాంకు రుణాలు, రైతు భరోసా, ఇతర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందే అవకాశం లభించిందన్నారు. అలాగే ములుగు జిల్లా ముల్కాపల్లి మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ, అశ్వరావుపేట, దమ్మపేట, ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలాల్లో ఈ రీసర్వే పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఆయా ప్రాంతాల్లో దశాబ్దాలుగుఅ కొనసాగుతున్న సమస్యకు పరిష్కరించి త్వరలోనే హక్కుదారులకు పాస్‌బుక్కులు అందిస్తామన్నారు.

ఇదే పద్ధతిలో ఇతర ప్రాంతాల్లో కూడా సర్వే నిర్వహించి దశాబ్దాలుగా భూమిపై హక్కుల కోసం ఎదురు చూస్తున్న ప్రజలకు హక్కులు కల్పించే విధంగా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ప్రజాకోణంలో రెవెన్యూ శాఖలో ప్రభుత్వం తీసుకుంటున్న విధాన పరమైన నిర్ణయాలు, ఉత్తర్వులు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు జరిగినప్పుడే ప్రజలకు మేలు జరుగుతుందని దీనిని దృష్టిలో పెట్టుకొని పనిచేయాలని అన్నారు. జనగామ జిల్లాలో ఫుడ్ పార్క్ ఏర్పాటుపై ఆ జిల్లా కలెక్టర్‌తో చర్చించారు.

ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ సెక్రటరీ డి.ఎస్.లోకేష్ కుమార్, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ ఐజి రాజీవ్ గాంధీ హనుమంత జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల వినియోగంలో వేగం పెంచాలి





**మొదటి పేజీ తరువాయి**

ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, సామాజిక, ఆర్థిక సాధికారత కోసం కేటాయించిన నిధుల వినియోగంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. జనాభా ప్రాతిపదికన కేటాయించిన సబ్‌ప్లాన్ నిధులు ఆయా వర్గాల సంక్షేమం, అభివృద్ధికి సమర్థవంతంగా ఉపయోగపడేలా శాఖలవారీగా వ్యయ ప్రణాళికలను పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. చట్ట నిబంధనలు, బడ్జెట్ కేటాయింపులకు అనుగుణంగా సాధారణ పద్దుల తరహాలోనే ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక పద్దుల కింద కేటాయించిన నిధులను కూడా పూర్తిస్థాయిలో వినియోగించాలని ఆదేశించారు. నిధుల ఖర్చులో ఉన్న అంతరాలను గుర్తించి, వాటిని అధిగమించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

నిధుల వినియోగంలో వెనుకబడిన శాఖలతో ఆర్థిక శాఖ అధికారులు ప్రత్యేకంగా సమీక్షలు నిర్వహించి, ఖర్చుల పురోగతిని వేగవంతం చేయాలని సూచించారు. ఈ మేరకు ముందుగా ఖర్చులో ఎక్కువ గ్యాప్ ఉన్న మొదటి ఐదు శాఖలు వ్యవసాయం, వైద్యం, ఇంధనం, పురపాలక, పంచాయతీరాజ్, సాంఘిక సంక్షేమం, పరిశ్రమలు, గిరిజన సంక్షేమ, తరువాత క్రమంలో ఇతర శాఖల కార్యదర్శులతో త్వరలోనే సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ఆయా శాఖలకు కేటాయించిన నిధులు, ఇప్పటివరకు జరిగిన వ్యయం, మిగిలిన నిధుల వినియోగానికి తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించి, నివేదిక రూపొందించాలని సూచించారు.

ఆర్థిక సంస్కరణలతో ఆదాయ వనరుల పెంపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేసేందుకు అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకోవడంతోపాటు, అదనపు ఆదాయ మార్గాలను గుర్తించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. బడ్జెట్ రూపకల్పనలో వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటూ, వ్యయ నియంత్రణ, నిధుల సద్వినియోగం, అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన ఆర్థిక వనరుల లభ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆర్థిక శాఖలో అమలు చేస్తున్న సంస్కరణలు, ప్రభుత్వ ఆదాయ వనరుల సమీకరణకు చేపడుతున్న చర్యలు, రుణాల పునర్వ్యవస్థీకరణపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర ఆర్థిక నిర్వహణ దీర్ఘకాలిక ప్రయోజనాలకు అనుగుణంగా ఉండేలా పటిష్టమైన ప్రణాళికలు రూపొందించాలని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆర్థిక నిర్ణయాలు తీసుకోవాలని పేర్కొన్నారు.

నిపుణుల సలహాలతో మెరుగైన ఆర్థిక నిర్వహణ

ఆర్థిక నిర్వహణలో అత్యుత్తమ ప్రమాణాలను పాటించేందుకు అనుభవజ్ఞులైన కన్సల్టెంట్లు, ఆర్థిక రంగ నిపుణుల సేవలను వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. నిపుణుల సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. బడ్జెట్ కేటాయింపులు, నిధుల వ్యయం, అభివృద్ధి కార్యక్రమాల అమలు మధ్య సమన్వయం ఉండేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులకు సూచించారు. సంక్షేమానికి కేటాయించిన నిధులు అర్హులైన వర్గాలకు ప్రయోజనం చేకూర్చేలా వినియోగం కావడంతోపాటు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ స్థిరత్వం, అభివృద్ధి లక్ష్యాల సాధనకు సమర్థవంతమైన ఆర్థిక నిర్వహణ అవసరమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఫైనాన్స్, ప్లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, ఫైనాన్స్ స్పెషల్ సెక్రటరీ సిక్తా పట్నాయక్‌తో పాటు ఇతర ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తాం



**మొదటి పేజీ తరువాయి**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదల సొంతింటి కలను నిజం చేయాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఆకర్షణీయమైన ప్రకటనలు, ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టిన గత ప్రభుత్వాల తరహాలో కాకుండా, ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రజా ప్రభుత్వ విధానమని తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం

రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 4.50 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేయడంతో పాటు, హైదరాబాద్‌లో లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. నగరంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పనులు సైతం ప్రారంభించామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు తండాల్లో నివసించే అర్హులైన పేద కుటుంబాలకు కూడా విడతలవారీగా ఇళ్లు మంజూరు చేస్తున్నామని వివరించారు.

ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.30 లక్షల నుంచి 2.40 లక్షల వరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు.

ఆర్థికపరమైన సవాళ్లు ఉన్నప్పటికీ పేదల సంక్షేమం విషయంలో ప్రభుత్వం వెనుకడుగు వేయబోదని మంత్రి స్పష్టం చేశారు. మూడో, నాలుగో విడతల్లోనూ అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, ఎన్ని విడతలు అవసరమైనా పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని భరోసా ఇచ్చారు.

పక్షపాతం లేకుండా పారదర్శకతకు పెద్ద పీట ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక, మంజూరులో ఎలాంటి పక్షపాతానికి తావులేకుండా పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లోనూ అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. పేదరికమే ప్రామాణికంగా అర్హులను గుర్తించి, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చివరి వ్యక్తి వరకు చేరేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని మంత్రి వివరించారు. సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతు భరోసా, రైతు రుణమాఫీ, రైతు బీమా వంటి పథకాల ద్వారా పేదలు, రైతులకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ మంత్రి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, కూసుమంచి మండల ఎంపీడీవో జశ్వంత్ కుమార్, తహసీల్దార్ సైదులు, హౌసింగ్ డీఈ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామి సన్నిధిలో సామూహిక కుంకుమార్చన



కౌతాళం మండల కేంద్రంలో ఉన్నటువంటి ఏకల్ గ్రామోతన్ ఫౌండేషన్ వారిచే స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయంలో లక్ష్మీ పూజ మరియు సామూహిక కుంకుమార్చన కార్యక్రమలు భక్తి శ్రద్ధాలతో ప్రత్యేక పూజలు అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ విద్యార్థినులు నవదుర్గ వేషధారణతో అందరినీ అలరించయి నృత్యాలు భక్తులుకు కనువిందుగా ఆకర్షించాయి. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ మారుతి మోహన్ మాట్లాడుతూ మన కౌతాళం గ్రామం మరియు మండలానికి ఈ ఫౌండేషన్ రావడం చాలా అదృష్టం అని మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మొత్తంలో మన కౌతాలంలో మాత్రమే అన్ని కోర్సులు ఉన్నాయని ప్రస్తుతం టైలరింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్,కోర్సు, త్వరలో మగ్గం వర్క్ కోర్సు ప్రారంభం అవుతుందని కావున ఈ సదవకాశాన్ని హిందూ మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గురు రాఘవేంద్ర రెడ్డి, రాజానంద్,కృష్ణ చైతన్య,మరియు బ్యూటీషియన్ ట్రైనర్ మాధురి, కోఆర్డినేటర్ ఖాదర్ లింగ కంప్యూటర్ ట్రైనర్ పరమేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట పట్టణం అద్దంల మెరిస్తుంది అంటే మీరే అలంకారం..

# మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు






**మొదటి పేజీ తరువాయి**

.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా కార్మికులకు ఒక్క రూపాయి జీతం పెంచలేదు కానీ నిత్యావసరాల ధరలు, బస్సు ఛార్జీలు, కరెంట్ బిల్లులు మాత్రం విపరీతంగా పెంచేశారు.సిద్దిపేట లో భూగర్భ డ్రైనేజీ, స్వీపింగ్ మిషన్లు, చెత్తకుండీల తొలగింపు, ఇంటింటికీ ఆటోలు, పందుల నివారణ చేపట్టి పారిశుధ్య కార్మికులకు శ్రమభారం తగ్గించాం.కాళేశ్వరం, మల్లన్న సాగర్ ద్వారా నల్లా ఆపరేటర్ల కష్టాలు తీర్చాం పెరిగిన ధరల నేపథ్యంలో పారిశుధ్య కార్మికుల జీతాలు పెంచాలని, మిగతా విభాగాల వారికీ గ్రూప్ విధానం అమలు చేయాలని అసెంబ్లీలో ప్రభుత్వంపై గట్టిగా పోరాడుతాం.సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో పట్టణ పారిశుధ్య కార్మికులతో కలిసి మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆత్మీయంగా ముచ్చటించారు. వారితో కలిసి టిఫిన్ చేసి, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం దసరా పండుగను పురస్కరించుకుని మున్సిపాలిటీతో సంబంధం లేకుండా తన సొంత ఖర్చులతో కార్మికులను ఘనంగా సత్కరించి, మహిళా కార్మికులకు చీరలు, పురుష కార్మికులకు ప్యాంట్, షర్టులను పండుగ కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.గతంలో కాంగ్రెస్ పాలనలో రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి ఉన్నప్పుడు పారిశుధ్య కార్మికులకు మూడు నెలలు, ఐదు నెలలు, ఆరు నెలలైనా జీతాలు రాకపోతుండే. జీతాల కోసం ఎర్రజెండాలు పట్టుకుని ఆర్డీవో ఆఫీస్ ముందు, కమిషనర్ ఆఫీస్ ముందు కార్మికులు నిత్యం ధర్నాలు చేసే దుస్థితి ఉండేది.నాడు కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ. 8,300 మాత్రమే ఔట్‌సోర్సింగ్ జీతం ఉండేది. అది కూడా కాంట్రాక్టర్ల చేతుల్లో పడి కార్మికులకు సకాలంలో అందేది కాదు.సిద్దిపేటకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు, జాతీయ స్థాయి గుర్తింపు వచ్చిందంటే అది ఒక హరీశ్ రావు గొప్పతనం కాదు. ఉదయాన్నే లేచి, రాత్రంతా చలికి, వానకు ఇబ్బందులు పడినా పట్టించుకోకుండా చీపుర్లు పట్టి ఊడ్చే అక్కాచెల్లెళ్ల రెక్కల కష్టం వల్లే సిద్దిపేటకు అవార్డులు వచ్చాయి.ఊరందరికీ నిరంతరం సేవ చేస్తున్న కార్మికులకు ఒకరోజు స్వయంగా బట్టలు పెట్టి, కలిసి టిఫిన్ చేసి నా వంతుగా సేవ చేద్దామనే ఉద్దేశంతోనే ఇక్కడికి వచ్చాను.

# 5 వార్డుల టీడీపీ ఏకగ్రీవం

అనంతపురం,అక్టోబరు 19 అనంతపురం జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు చేతులెత్తేశారు. తాడిపత్రి మున్సిపాలిటీలో టీడీపీ అధికారికంగా తన బోణీ కొట్టింది. నామినేషన్ల ప్రక్రియ ముగిసే సమయానికి తాడిపత్రి మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 5 వార్డులను టీడీపీ ఏకగ్రీవంగా కైవసం చేసుకుని తన ఆధిపత్యాన్ని చాటుకుంది.తాడిపత్రి మున్సిపాలిటీలోని 32, 33, 11, 14 , 45వ వార్డుల్లో ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఎవరూ నామినేషన్లు వేయలేదు.ఈ వార్డుల్లో టీడీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, పోటీగా నిలబడేందుకు వైఎస్సార్‌సీపీ తరఫున కనీసం ఒక్క అభ్యర్థి కూడా ముందుకు రాలేదు. గతంలో తాడిపత్రిలో ఏకచక్రాధిపత్యం చలాయించామని చెప్పుకునే వైసీపీకి, ఇప్పుడు కనీసం బి-ఫామ్ ఇచ్చి పోటీకి నిలబెట్టేందుకు అభ్యర్థులు కరువవ్వడం చర్చనీయాంశమైంది. అభ్యర్థులు లభించకపోవడంతో నామినేషన్లు పడక ఈ ఐదు వార్డులు టీడీపీ పరమయ్యాయి. 37వ వార్డులో స్వయంగా జేసీ ప్రభాకర్ రెడ్డి కౌన్సిలర్‌గా నామినేషన్ వేశారు. ఆయనపై వైసీపీ అభ్యర్థి నిలబడ్డారు.గుంత కల్ మున్సిపాలిటీలో మొత్తం 32 వార్డులకు గాను వైసీపీ కేవలం 8 వార్డుల్లో మాత్రమే అభ్యర్థులను నిలబెట్టుకోగలిగింది. మిగిలిన 24 వార్డుల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులే దొరక్కపోవడంతో వైసీపీ పూర్తిగా చేతులెత్తేసింది. ఎమ్మెల్యే జయరాం వర్గం క్షేత్రస్థాయిలో వేసిన ఎత్తుగడలు, బూత్ స్థాయి వ్యూహాల ముందు ప్రతిపక్ష వైసీపీ కనీస పోటీ కూడా ఇవ్వలేక విఫలమైంది.ఐదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు అడ్డగోలు నిర్ణయాలు, ఆధిపత్య ధోరణితో వ్యవహరించిన వైఎస్సార్‌సీపీకి, ఇప్పుడు అనంతపురం జిల్లా ప్రజలు, స్థానిక నేతలే గట్టి పాఠం చెప్పారనే వ్యాఖ్యలు వినపడుతున్నాయి. నామినేషన్ల దశలోనే మున్సిపాలిటీలు, వార్డుల వారీగా వైసీపీ అభ్యర్థులు కరువై మైదానం వదిలి వెళ్లడం జిల్లా ముఖ్య నేతల్ని ఆశ్చర్యానికి గురి చేస్తోంది.

## ప్రపంచబ్యాంక్, ఏడీబీ మెచ్చిన అమరావతి పురోగతి

విజయవాడ ,అక్టోబరు 19 ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనుల్లో మరో చారిత్రాత్మక ఘట్టం చోటుచేసుకోబోతోంది. రాజధాని ప్రాంతంలో జరుగుతున్న పనుల వేగం, కార్మికుల సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ , ఆధునిక మౌలిక వసతుల కల్పనపై ప్రపంచబ్యాంక్ , ఆసియా అభివృద్ధి బ్యాంక్ సంతృప్తి వ్యక్తం చేశాయి. ప్రణాళికాబద్ధమైన నగరాల నిర్మాణంలో అమరావతి అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక స్థానాన్ని దక్కించుకోనుందని ఈ అంతర్జాతీయ ఆర్థిక సంస్థల ప్రతినిధులు ప్రశంసించారు.

రాజధాని నిర్మాణం నిధుల కొరత లేకుండా వేగంగా ముందుకు సాగేలా, ఏపీ సీఆర్‌డీఏ కోరిన మరో రూ. 15,000 కోట్ల అదనపు రుణ ప్రతిపాదనలకు ఈ బ్యాంకులు పచ్చజెండా ఊపాయి.ప్రస్తుతం అమరావతిలో రూ. 52,000 కోట్ల అంచనా వ్యయంతో 102 రకాల కీలక పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే కేటాయించిన నిధులకు అదనంగా మరో రూ. 15,000 కోట్లు అందనుండటంతో హైకోర్టు, అసెంబ్లీ భవనాలు, సచివాలయ ప్రాజెక్టులు, ఐకానిక్ నిర్మాణాలు , ఉద్యోగుల గృహసముదాయాల నిర్మాణాల్లో మరింత పురోగతి రానుంది. ప్రపంచ బ్యాంక్ బృందం ఇటీవల క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల నాణ్యతను, నిర్దేశిత గడువు ప్రకారం సాగుతున్న తీరును సమీక్షించిన అనంతరం ఈ అదనపు నిధుల మంజూరుకు సుముఖత వ్యక్తం చేయడం పనుల పారదర్శకతకు నిదర్శనంగా నిలిచింది.కేవలం భవనాల నిర్మాణమే కాకుండా, రాబోయే తరాలకు అనుగుణంగా గ్రీన్ అండ్ క్లైమేట్-రెసిలెంట్ నగరంగా అమరావతిని రూపుదిద్దుతున్నారు. అంతర్జాతీయ స్థాయిలో పేరుగాంచిన బెస్ట్ ప్రాక్టీసెస్‌ను ఉపయోగిస్తూ, డ్రైనేజీ వ్యవస్థ, ఫ్లడ్ మేనేజ్‌మెంట్ మరియు స్మార్ట్ లాజిస్టిక్స్ కారిడార్లను ప్రాధాన్యతా ప్రాతిపదికన అభివృద్ధి చేస్తున్నారు. నూతనంగా సమకూరే నిధుల నిర్వహణను పర్యవేక్షించేందుకు ప్రత్యేక ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్‌ను నియమించేందుకు సీఆర్‌డీఏ సన్నాహాలు చేస్తోంది

ఈ భారీ అంతర్జాతీయ నిధుల ప్రవాహంతో అమరావతికి మౌలిక సదుపాయాలే కాకుండా, అంతర్జాతీయ పెట్టుబడులు, పారిశ్రామిక పురోగతి , ఉపాధి అవకాశాలు భారీగా పెరగనున్నాయి. ప్రపంచ స్థాయి మౌలిక వసతులతో నిర్మాణం జరుపుకుంటున్న అమరావతి, ప్రపంచంలోనే అత్యుత్తమ గ్రీన్ ఫీల్డ్ ప్లాన్డ్ సిటీల్లో ఒకటిగా నిలిచే దిశగా వేగంగా అడుగులు వేస్తోంది.

## కాంగ్రెస్ తరపున ఆమంచి వ్యక్తిగత పోరాటం

చీరాల, ,అక్టోబరు 19 ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సమరం ఆసక్తికరంగా మారుతోంది. ప్రధానంగా అధికార టీడీపీ-కూటమికి, పుంజుకుంటున్న కాంగ్రెస్ పార్టీకి మధ్య హోరాహోరీ పోరుకు రంగం సిద్ధమైంది. మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆమంచి కృష్ణమోహన్ క్షేత్రస్థాయిలో వేస్తున్న వ్యూహాత్మక అడుగులు చీరాల పురపోరును ఒక్కసారిగా వేడెక్కించాయి. ఇతర పార్టీల నుంచి కీలక నేతలను చేర్చుకుంటూ కాంగ్రెస్ క్షేత్రస్థాయిలో తన పట్టును బలపరుచుకుంటోంది.

ఈ క్రమంలోనే చీరాల రాజకీయాల్లో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. చీరాల బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొత్త మాసు సురేష్ తన అనుచరులతో కలిసి ఆమంచి కృష్ణమోహన్ సమక్షంలో అధికారికంగా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. పొత్తులు, స్థానిక రాజకీయంలో అసంతృప్తి చెంది ఆయన కాంగ్రెస్ వైపు అడుగులు వేసినట్లు తెలుస్తోంది. బొంబే సురేష్ చేరికతో పట్టణ పరిధిలో వ్యాపార, సామాజిక సమీకరణాల్లో కాంగ్రెస్ బలం మరింత పెరిగిందని, స్థానిక పోరులో ఇది కాంగ్రెస్‌కు అదనపు బలాన్ని ఇస్తుందని భావిస్తున్నారు.చీరాల మున్సిపాలిటీలోని మొత్తం 44 వార్డుల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులను బరిలోకి దింపుతున్నట్లు ఆమంచి కృష్ణమోహన్ స్పష్టం చేశారు. ప్రతి వార్డులోనూ బలమైన అభ్యర్థులను నిలబెట్టి, టీడీపీ కూటమికి గట్టి పోటీ ఇచ్చేందుకు ఆయన పక్కా ప్రణాళికతో ముందడుగు వేస్తున్నారు. స్వయంగా రంగంలోకి దిగి వార్డుల వారీగా ఆశావహుల ఎంపిక, ప్రచార వ్యూహాలను ఆమంచి పర్యవేక్షిస్తున్నారు. దీంతో చీరాల పురపాలక పీఠం దక్కించుకునేందుకు కాంగ్రెస్ శ్రేణులు పూర్తిస్థాయిలో సమాయత్తమవుతున్నాయి.

అధికార బలంతో పాటు స్థానిక శాసనసభ్యుల మద్దతుతో మున్సిపాలిటీపై పట్టు సాధించాలని టీడీపీ ప్రణాళికలు రచిస్తోంది. ఆమంచి కృష్ణమోహన్ సారథ్యంలోని కాంగ్రెస్ గట్టి సవాలు విసురుతుండటం కొరకరాని కొయ్యగా మారింది. చీరాల మున్సిపల్ ఎన్నికలు కేవలం స్థానిక పోరుగానే కాకుండా, ఇద్దరు కీలక నేతల ప్రతిష్ఠాత్మక సమరంగా మారడంతో ఇక్కడ ఫలితం ఎలా ఉండబోతుందోనన్న ఆసక్తి వ్యక్తమవుతోంది. ఆమంచి రాజకీయ భవిష్యత్ కు ఈ ఎన్నికలు చాలా కీలకం.

## రాత్రికి రాత్రే పార్టీ మార్పు.. వైసీపీ కండువా!

పెనుకొండ,అక్టోబరు 19 రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేం.. పదవి కోసం పార్టీలు మారడం, రాజకీయ సమీకరణాలు ఒక్కసారిగా మారిపోవడం సర్వసాధారణం. తాజాగా శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలో చోటుచేసుకున్న పరిణామం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. నిన్నటి వరకు తెలుగుదేశం పార్టీలో కొనసాగిన ఓ నాయకుడు.. టికెట్ దక్కకపోవడంతో పార్టీ మారి, ఏకంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా బరిలోకి దిగడం చర్చనీయాంశంగా మారింది.పెనుకొండకు చెందిన బోయ శ్రీనివాసులు అలియాస్ జంపు శ్రీను గతంలో సర్పంచ్‌గా పనిచేశారు. సుమారు మూడు దశాబ్దాలుగా టీడీపీలో కొనసాగుతున్న ఆయన.. పెనుకొండ మున్సిపల్ చైర్మన్ పదవిని ఆశించినట్లు సమాచారం. ఈ క్రమంలో పార్టీ తరఫున టికెట్ కోసం ప్రయత్నాలు చేసినప్పటికీ, చివరకు ఆయనకు నిరాశ ఎదురైంది.పెనుకొండ మున్సిపల్ చైర్మన్ టీడీపీ అభ్యర్థిగా త్రివేంద్రమూర్తి పేరును ప్రకటించడంతో జంపు శ్రీను అసంతృప్తికి గురయ్యారు. పార్టీలో ఇన్నేళ్లుగా కొనసాగినా తగిన గుర్తింపు, గౌరవం లభించలేదనే భావనతో ఆయన పార్టీ మారాలని నిర్ణయించుకున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.టీడీపీలో చైర్మన్ టికెట్ దక్కకపోవడంతో జంపు శ్రీను వైసీపీ నేతలతో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. అనంతరం మాజీ మంత్రి ఉషశ్రీ సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. పార్టీ మారడమే కాకుండా, పెనుకొండ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా కూడా ఆయన తెరపైకి రావడం స్థానిక రాజకీయాల్లో అనూహ్య పరిణామంగా మారింది. నిన్నటి వరకు టీడీపీలో చైర్మన్ టికెట్ కోసం ప్రయత్నించిన నాయకుడు.. నేడు అదే పదవి కోసం వైసీపీ తరఫున పోటీకి సిద్ధమవడం రాజకీయ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.జంపు శ్రీను పార్టీ మార్పుతో పెనుకొండ మున్సిపల్ చైర్మన్ పోటీ మరింత ఆసక్తికరంగా మారింది. టికెట్ కేటాయింపులు, వ్యక్తిగత రాజకీయ ఆశయాలు, పార్టీ నాయకత్వ నిర్ణయాలు స్థానిక రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయనే చర్చ మొదలైంది. అయితే, ఈ పరిణామం ఎన్నికల ఫలితాలపై ఎంతవరకు ప్రభావం చూపుతుందో వేచి చూడాలి. నిన్న ఒక పార్టీ నాయకుడు.. నేడు మరో పార్టీ చైర్మన్ అభ్యర్థి! పెనుకొండలో చోటుచేసుకున్న ఈ రాజకీయ మలుపు మరోసారి రాజకీయాల్లో ఏదైనా సాధ్యమేనని చాటుతోంది.

## షాపింగ్‌కు వెళ్లి వచ్చేలోపు.. ఇంట్లో భారీ చోరీ

మేడ్చల్ కుషాయిగూడలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో చోటీ చోటు చేసుకుంది. జయలక్ష్మి(72) అనే వృద్ధురాలు దసరా షాపింగ్ కోసం బయటకు వెళ్లారు. ఇంటికి తిరిగొచ్చాక.. గ్రిల్ గేట్ తెరిచి ఉండి, బీరువా పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. ఇంట్లో చోరీ జరిగిందని గ్రహించి.. వెంటనే పోలీసుల్ని ఆశ్రయించింది. ఇంట్లో బంగారం, వెండి ఆభరణాలు మాయం అయినట్లు గుర్తించారు.

రెండు జతల బంగారు చెవిపోగులు (14 గ్రాములు), వెండి గొలుసు (25 గ్రాములు), వెండి పట్టీలు (80 గ్రాములు) చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని గుర్తించి పట్టుకునేందుకు.. గాలింపు చర్యలు చేపట్టారు.

# ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ను ప్రారంభించిన సీఎం రేవంత్








మొదటి పేజీ తరువాయి

ఫ్యూచర్ సిటీ / ఇబ్రహీంపట్నం । 19 అక్టోబర్ 2026:తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీ ప్రాంతంలో పోలీసు వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా మరో కీలక ముందడుగు పడింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో విస్తారమైన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్‌ను గౌరవ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత, వేగవంతమైన పోలీసు సేవలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పోలీసు వ్యవస్థను మరింత మెరుగుపరచడంలో ఈ కమిషనరేట్ కీలక పాత్ర పోషించనుంది.

కమిషనరేట్‌కు చేరుకున్న ముఖ్యమంత్రికి పోలీసు బలగాలు ఘనంగా గౌరవ వందనం (గార్డ్ ఆఫ్ ఆనర్) సమర్పించాయి. అనంతరం ముఖ్యమంత్రి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి, ఐపీఎస్ ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రితో కలిసి కమిషనరేట్ ప్రాంగణమంతా తిరిగి, కార్యాలయాన్ని స్వయంగా చూపించారు.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సీ.వీ. ఆనంద్, ఐపీఎస్; ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్, డీజీ శ్రీమతి అభిలాషా బిష్ట్, ఐపీఎస్; లా అండ్ ఆర్డర్ డీజీపీ మహేశ్ ఎం. భగవత్, ఐపీఎస్; ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి, ఐపీఎస్; జాయింట్ పోలీస్ కమిషనర్ శ్రీమతి జి. చందనా దీప్తి, ఐపీఎస్ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్య, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ కూడా ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. వీరితో పాటు అన్ని జోన్ల డీసీపీలు, ఇతర సీనియర్ పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది కార్యక్రమానికి హాజరయ్యారు.

ఫ్యూచర్ సిటీ ప్రాంతంలో మరింత పటిష్టమైన పోలీసు వ్యవస్థతెలంగాణ ప్రభుత్వం 2025 డిసెంబర్‌లో సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలోని కొన్ని ప్రాంతాలను పునర్వ్యవస్థీకరించి ప్రత్యేకంగా ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్‌ను ఏర్పాటు చేసింది.

ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడం, శాంతిభద్రతలను సమర్థవంతంగా నిర్వహించడం, నేరాల నియంత్రణ, పోలీసు పర్యవేక్షణను మెరుగుపరచడం, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించడం ఈ కమిషనరేట్ ప్రధాన లక్ష్యాలు.

ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, షాద్‌నగర్, చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు ఈ కమిషనరేట్ పరిధిలో ఉన్నాయి.

ఫ్యూచర్ సిటీ విస్తరణకు అనుగుణంగా ఇటీవల ప్రభుత్వం పోలీసు వ్యవస్థను మరింత పునర్వ్యవస్థీకరించింది. అదనపు పోలీస్ జోన్లు, డివిజన్లతో పాటు మహిళా పోలీస్ స్టేషన్లు, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. దీని ద్వారా ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు అవకాశం ఏర్పడనుంది.

ఆధునిక టెక్నాలజీతో ఫ్యూచర్ సిటీ పోలీసింగ్ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి, ఐపీఎస్ నాయకత్వంలో ఫ్యూచర్ సిటీ పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సైబర్ నేరాల దర్యాప్తు, డిజిటల్ ఆధారాల విశ్లేషణ, ఆధునిక నేర పరిశోధన పద్ధతులు, మహిళల భద్రత, నేరాల నివారణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

పోలీసు సిబ్బందికి అధునాతన శిక్షణ అందిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే 210 మందికి పైగా పోలీసు అధికారులు, సిబ్బంది ఏఐ ఛాంపియన్స్ శిక్షణ కార్యక్రమాన్ని పూర్తి చేశారు.

ప్రజల భద్రతకు పెద్దపీట వేస్తూ, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించే లక్ష్యంతో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ముందుకు సాగుతోంది.

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ప్రారంభం కావడం తెలంగాణలో ఆధునిక పోలీసు వ్యవస్థ బలోపేతానికి మరో ముఖ్యమైన ముందడుగుగా నిలిచింది.

# వేడెక్కిన రాజకీయం..

### విజయసాయిరెడ్డి, కేశినేని చిన్నిల మధ్య మాటల యుద్ధం

విజయవాడ ,అక్టోబరు 19 విజయవాడ మేయర్ సీటు కేరాఫ్‌గా మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి, టీడీపీ ఎంపీ కేశినేని చిన్నిల మధ్య మాటల యుద్ధం సాగింది. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగడం వెనుక టీడీపీ కుట్ర ఉందని విజయసాయిరెడ్డి ఆరోపించారు. ఈ ఆరోపణలపై టీడీపీ ఎంపీ కేశినేని చిన్ని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తమ ఉనికిని చాటుకునేందుకే ం2గా ఉన్న సాయిరెడ్డి తప్పుడు ప్రచారాం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. విజయసాయి రెడ్డి కావాలనే టీడీపీపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. దీంతో విజయవాడ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కనుసన్నల్లోనే ఏబీవీ వెంకటేశ్వరరావు ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నారని విజయసాయిరెడ్డి ఆరోపణలు చేశారు. కాపు సామాజిక వర్గానికి చెందిన వంగవీటి రాధాను జనసేన పార్టీలోకి పంపించి.. కమ్మ సామాజిక వర్గానికి చెందిన ఏబీవీని స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలపడం చంద్రబాబు మార్కు దుర్మార్గపు రాజకీయానికి నిదర్శనమని విజయసాయి రెడ్డి అన్నారు. ఏబీవీకి వామపక్షాలు మద్దతు తెలుపు తుండటంపై ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, వైసీపీలు అన్ని ఒక్కటేనని, కలసి రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. 'జగన్ నెవర్ అగైన్' అని శపథం చేసిన ఏబీవీ ఉద్దేశపూర్వకంగానే రెడ్డి పారిశ్రామికవేత్తలను టార్గెట్ చేశారని, ఇటువంటి పాలిటిక్స్‌ని ప్రజలు హర్షించరని విజయసాయి రెడ్డి పేర్కొన్నారు.అయితేవిజయసాయిరెడ్డి కామెంట్స్‌పైకేశినేనిచిన్నితీవ్రస్థాయిలో మండిపడ్డారు. తమ ఉనికిని చాటుకునేందుకే ం2గా ఉన్న సాయిరెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ఏబీ వెంకటేశ్వరరావు ఒక రిటైర్డ్ అధికారి అని, ఆయన వ్యక్తిగత హోదాలో పోటీ చేస్తున్నారని కేశినేని చిన్ని అన్నారు. దీనికి టీడీపీకి ముడిపెట్టడం వైసీపీ కుట్ర అని పేర్కొన్నారు. విజయసాయిరెడ్డి ఇప్పుడు ఔఆం కూటమిలో చిచ్చు పెట్టేందుకు తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. విజయ సాయిరెడ్డి ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా... ఎంత బురద జల్లినా కూటమి ఐక్య తను దెబ్బతీయలేరని, వంగవీటి రాధాను అత్యధిక మెజారిటీతో మేయర్‌గా గెలిపించుకుని కూటమి పార్టీలు సత్తా చాటుతాయని కేశినేని చిన్ని సవాల్ విసిరారు. అదేవిధంగా అన్నిచోట్ల కూటమి విజయంతో విజయసాయి రెడ్డి లాంటి నోళ్లు మూయిస్తామని ఎక్స్ వేదికగా కౌంటర్ ఇచ్చారు.

## ఆలయ కోనేరులో మునిగిపోయిన కారు

రంగారెడ్డి అదుపు తప్పిన ఇన్నోవా క్రిస్టా కారు ఆలయ కోనేరులో మునిగిపోయింది. మహేశ్వరంలోని శివగంగ రాజరాజేశ్వర దేవాలయ కోనేరులోకి దూసుకెళ్లి నీటిలో కారు మునిగిపోయింది. అప్రమత్తమై డ్రైవర్ కారు డోరు తీసుకుని బయటికి వచ్చాడు. డ్రైవర్ తప్ప కారులో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రమాదానికి అతివేగమే కారణమని స్థానికులు అంటున్నారు.

# ఖైరతాబాద్ లిట్మస్ టెస్ట్

హైదరాబాద్,అక్టోబరు 19 రాజకీయం ఎపుడూ ఒకేలా ఉండదు. అది మారుతూ ఉంటుంది. ప్రజాభిప్రాయం నిరంతరం గతులు మార్చుకుంటుంది. 2023లో కేసీఆర్ ఓడిపోగానే ఆయన పని అయిపోయింది అని అన్న వారు ఉన్నారు. 2024 లో లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ కి ఒక్క పార్లమెంట్ సీటు కూడా రాలేదు, ఆ తరువాత జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ రెండు ఎమ్మెల్యే సీట్లకు జరిగిన ఉప ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ కి చేదు అనుభవాలు ఎదురయ్యాయి. కానీ అది నిజం కాదని తాజాగా ఖైరతాబాద్ లో ఒక ప్రముఖ సర్వే సంస్థ ఆర్ఆర్ నిర్వహించిన దాంట్లో తేలింది. ఇందులో విశ్లేషణలు చూస్తే కనుక బీఆర్ఎస్ దే మరోసారి తెలంగాణాలో అధికారం అన్నది తేలుతోంది. లిట్మస్ టెస్ట్ గా రేపు జరగబోయే ఖైరతాబాద్ ఉప ఎన్నికల ఫలితం ఉండబోతోంది అని ఈ సర్వే స్పష్టం చేసింది. తరువాత సీఎం ఆయనే : ఖైరతాబాద్ ఉప ఎన్నికల గురించి జనాభిప్రాయాన్ని ఆర్ ఆర్ సర్వే చాలా లోతుల్లోకి వెళ్ళి రాబట్టింది. దానిలో కేసీఆర్ పాలన గురించి జనాలను ప్రశ్నించినపుడు అత్యధిక శాతం ఆయన హయాంలో బాగుంది అని చెప్పారు. అంతే కాదు 2028 లో జరిగే ఎన్నికల్లో సీఎం ఎవరు అంటే కేసీఆర్ అని ఏకంగా 53.84 శాతం మంది ఓటేశారు. ఇక ప్రస్తుతం సీఎం గా ఉన్న రేవంత్ రెడ్డికి 20.87 శాతం మద్దతు తెలిపితే బీజేపీ ఫైర్ బ్రాండ్, కేంద్ర మంత్రి బండి సంజయ్ తదుపరి సీఎం అంటూ కేవలం 14.30 మంది చెప్పారు. మరో కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డికి 4.39 శాతం లభించింది. ఈ సర్వే ప్రకారం చూస్తే కనుక అందరి కంటే చాలా దూరంలోనే కేసీఆర్ నిలిచి తెలంగాణా ప్రజల అభిమానం అందుకున్నారు అని అర్థం అవుతోంది. అంతే కాదు కేసీఆర్ పరిపాలన ఉత్తమంగా ఉందని, అభివృద్ధి సంక్షేమం ఆయన హయాంలోనే బాగా జరిగాయని ఖైరతాబాద్ జనాలు బల్ల గుద్ది మరీ చెప్పారు. ఆర్ఆర్ సర్వే ప్రకారం చూస్తే రెండు సార్లు సీఎం గా చేసిన కేసీఆర్ కి మద్దతుగా 57.14 శాతం మంది నిలిచారు. అదే సమయంలో రేవంత్ రెడ్డి రెండున్నరేళ్ళ పాలన బాగుందని 21.97 శాతం మంది మాత్రమే మద్దతు ఇవ్వడం విశేషం. అంటే కాంగ్రెస్ ప్రభుత్వం తాము చెప్పుకుంటున్నట్లుగా తెలంగాణాలో అభివృద్ధి సంక్షేమం పట్ల జనం అంత సంతృప్తిగా లేరు అన్నది రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో ఒక కీలక నియోజకవర్గం. రాజకీయంగా చైతన్యవంతమైన ఖైరతాబాద్ లో ఓటర్ల మనోభావాలు తెలియచేశాయని అంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కంటే ఎన్నికల హామీల అమలుతో సక్రమంగా పనిచేసింది అని ఆర్ఆర్ సర్వే ప్రకారం జనాలు కితాబు ఇస్తున్నారు. బీఆర్ ఎస్ సర్కార్ ఇచ్చిన మాట మేరకు హామీలు నెరవేర్చింది అని 54.94 శాతం మంది చెబుతూ జై కొట్టారు. అదే కాంగ్రెస్ ఎన్నికల హామీల విషయంలో అంత కచ్చితంగా అమలు చేయడం లేదన్న భావనలో జనాలు ఉన్నారనడానికి ఆ పార్టీకి 19.78 శాతం ప్రజల మద్దతు దక్కడం ఒక ఉదాహరణగా చూడాలని అంటున్నారు. లిట్మస్ టెస్ట్ అంటే అన్నంలో ఒక మెతుకుని పట్టడం లాంటిది. ఖైరతాబాద్ లో ఉప ఎన్నికలు జరగలేదు. జనం మూడ్ ఇదీ అని ఆర్ఆర్ సర్వే తన నివేదిక బయటపెట్టింది. దాని ప్రకారం చూస్తే అక్కడ ఉప ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్ అభ్యర్ధి గెలుస్తారు అని 36.89 శాతం ఓటు షేర్ దక్కుతుందని ఈ సర్వే వెల్లడిస్తోంది. అదే కాంగ్రెస్ కి 34.78 శాతం ఓటు షేర్ దక్కి రెండో ప్లేస్ లో ఉంటుందని తేటతెల్లం చేసింది. ఇవన్నీ పక్కన పెడితే గత రెండున్నరేళ్ల బట్టి కేసీఆర్ అయితే జనంలో లేరు, ఆయన పెద్దగా సభలు సమావేశాలు కూడా నిర్వహించలేదు. కానీ ఆయన తదుపరి సీఎం అని జనాలు అంటున్నారు. అలాగే బీఆర్ ఎస్ హామీలు బాగా నెరవేర్చింది అని సమర్థిస్తున్నారు. సరికొత్త రాజకీయ సరళిగా : బీఆర్ఎస్ పాలన బెస్ట్ అని ప్రశంసిస్తున్నారు. మరి ఎన్నికల ముందు కనుక కేసీఆర్ జనంలోకి వచ్చి ప్రచారం చేస్తే ఇంకా ఈ సానుకూలత పెరుగుతుందని అంటున్నారు. ఏది ఏమైనా ఆర్ ఆర్ సర్వే అయితే జనం నాడిని పట్టుకుంది అని అంటున్నారు. అధికార పార్టీలకు యాంటీ ఇంకెంబెన్సీ అన్నది పెరగడం ఇటీవల కాలంలో దేశవ్యాప్తంగా ఒక సరికొత్త రాజకీయ సరళిగా ఉంది. ఒక అయిదేళ్లకు మాత్రమే ప్రభుత్వాన్ని జనాలు ఎన్నుకుంటున్నారు. రెండోసారి చాన్స్ ఇచ్చేందుకు ఇష్టపడడం లేదు, అది తమిళనాడులో ఇటీవల ఎన్నికల్లో వెల్లడైంది. ఏపీలో వరుస మూడు ఎన్నికల్లో అలాగే జరిగింది. రేపటి ఎన్నికల్లో తెలంగాణాలో అదే జరుగుతుందా అంటే ఆర్ఆర్ సర్వే ప్రకారం చూస్తే అవును అన్న మాట వస్తోంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# కాంగ్రెస్‌కు ప్రతిష్ఠాత్మకంగా మారిన ఎమ్మెల్సీ పోరు

హైదరాబాద్,అక్టోబరు 19 తెలంగాణలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కసరత్తును ముమ్మరం చేసింది. అభ్యర్థుల ప్రకటన తర్వాత ఇప్పుడు ఓటర్ల నమోదు, క్షేత్రస్థాయి సమన్వయంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందులో బ . ా ం
హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్, వరంగల్-ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా 77 మంది సమన్వయకర్తలను నియమించింది. టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ ఈ మేరకు బాధ్యతలను అప్పగించారు.రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఇప్పటికే రెండు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన అధిష్ఠానం.. ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర నాయకత్వానికి దిశానిర్దేశం చేసింది. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ స్థానం నుంచి సామ రామ్మోహన్ రెడ్డి, వరంగల్-ఖమ్మం-నల్గొండ స్థానం నుంచి రామరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని కాంగ్రెస్ బరిలోకి దింపుతోంది.అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేసిన కాంగ్రెస్.. ఇప్పుడు ఓటర్ల జాబితాలో అర్హులైన పట్టభద్రుల పేర్ల నమోదుపై ప్రధానంగా దృష్టి సారించింది. పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని నాయకత్వం సూచించింది.రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో ఎన్నికల సన్నద్ధతను బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి 43 మందిని, వరంగల్-ఖమ్మం-నల్గొండ నియోజకవర్గానికి 34 మందిని సమన్వయకర్తలుగా నియమించింది. ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో వారికి బాధ్యతలు అప్పగించగా, ఇతర ప్రాంతాల్లో ఎంపీలు, ఎమ్మెల్సీలు, పార్టీ సీనియర్ నేతలకు బాధ్యతలు కేటాయించారు.కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సమన్వయ బాధ్యతలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు అనుముల తిరుపతి రెడ్డికి అప్పగించడం రాజకీయంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. నియోజకవర్గాల వారీగా నేతలంతా సమన్వయంతో పనిచేసి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పీసీసీ నాయకత్వం స్పష్టం చేసింది.మరోవైపు, ఢిల్లీలోని ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, ఇతర ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, ఓటర్ల నమోదు, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణుల సమన్వయం వంటి అంశాలపై చర్చించారు.రెండు స్థానాల్లోనూ విజయం సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని సీఎం, పీసీసీ అధ్యక్షుడు నేతలకు సూచించినట్లు సమాచారం. ఓటర్ల నమోదు ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా, అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు అయ్యేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని దిశానిర్దేశం చేశారు.ఈ ఎన్నికల్లో ఓటర్ల జాబితా కీలకంగా మారనుంది. తెలంగాణలోని రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఓటర్ల జాబితాను కొత్తగా సిద్ధం చేసే ప్రక్రియ కొనసాగుతోంది. అర్హులైన పట్టభద్రులు ఫారం-18 ద్వారా కొత్తగా దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటికే పాత జాబితాలో పేర్లు ఉన్నవారు కూడా కొత్త జాబితాలో చోటు కోసం మళ్లీ దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం.. 2026 నవంబర్ 6 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితా, డిసెంబర్ 30న తుది జాబితా ప్రకటించనున్నారు. ప్రస్తుత సభ్యుల పదవీకాలం 2027 మార్చిలో ముగియనున్న నేపథ్యంలో, వచ్చే ఏడాది మార్చిలో ద్వైవార్షిక ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. అయితే, పోలింగ్ తేదీలను ఎన్నికల సంఘం విడిగా ప్రకటించాల్సి ఉంది.
అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు ఈ రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలు రాజకీయంగా కీలకంగా మారాయి. అభ్యర్థుల ఎంపిక నుంచి సమన్వయకర్తల నియామకం వరకు వేగంగా అడుగులు వేస్తున్న పార్టీ.. ఇప్పుడు పట్టభద్రుల మద్దతును కూడగట్టడంపై దృష్టి సారించింది. ఓటర్ల నమోదు ప్రక్రియను ఎంత సమర్థంగా నిర్వహిస్తారు? క్షేత్రస్థాయిలో నేతలంతా ఎంత సమన్వయంతో పనిచేస్తారు? అన్న అంశాలు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

# సింగరేణి చుట్టూ రాజకీయాలు

హైదరాబాద్,అక్టోబరు 19 సింగరేణి చుట్టూ రాజకీయాలు వేడెక్కాయి. సింగరేణిని దెబ్బతీస్తున్నారంటూ అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య విమర్శల పర్వం కొనసాగుతోంది. సింగరేణిలో నెలకొన్న నష్టాలకు, ప్రస్తుత దుస్థితికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలే కారణమని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపిస్తుండగా? ప్రభుత్వ వైఫల్యాలే సింగరేణి దుస్థితికి కారణమని కేటీఆర్ విమర్శిస్తున్నారు. సుమారు 3,000 కోట్ల రూపాయల బొగ్గు దిగుమతి కుంభకోణం జరిగిందని ఆరోపించారు. అయితే సింగరేణి అంశంపై ఎలాంటి విచారణకైనా సిద్ధమని సీఎం రేవంత్ సవాల్ విసిరారు.
సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి తగ్గిపోవడం, విదేశీ బొగ్గును దిగుమతి చేసుకుంటూ ఉండడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ కోసం గ్రేడ్-9 బొగ్గును విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాలనే ప్రతిపాదనపై సీబీఐ, ఈడీ లేదా ఐటీ విభాగాలతో స్వతంత్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. విదేశీ బొగ్గు దిగుమతుల వల్ల సుమారు 3,000 కోట్ల రూపాయల కుంభకోణం జరిగే అవకాశం ఉందని చెప్పారు. లాజిస్టిక్స్, ప్రొక్యూర్‌మెంట్ డెసిషన్స్‌లో భారీగా కమిషన్లు చేతులు మారుతున్నాయని కేటీఆర్ ఆరోపించారు. అంతేకాకుండా, గతంలో సింగరేణి ద్వారా సరఫరా కావాల్సిన బొగ్గును క్రమంగా తగ్గించి, విదేశీ దిగుమతుల వైపు మొగ్గు చూపేలా ప్లాన్ చేసారని ఆయన మండిపడ్డారు. సింగరేణి ఉత్పత్తి 2023-24లో సుమారు 70.02 మిలియన్ టన్నుల నుంచి 2025-26 నాటికి 58 మిలియన్ టన్నులకు పడిపోయిందని, సంస్థ రావాల్సిన బకాయిలు, చెల్లింపులపై సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.
కేటీఆర్ ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గట్టిగా స్పందించారు. విదేశీ బొగ్గు దిగుమతి వ్యవహారంపై ఏ దర్యాప్తు సంస్థతోనైనా విచారణ జరిపించడానికి ప్రభుత్వం సిద్ధమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే యాదాద్రి ప్లాంట్ కోసం విదేశాల నుంచి గ్రేడ్-9 బొగ్గును దిగుమతి చేసుకునేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నారని ఆయన ఆధారాలతో సహా వివరించారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల సింగరేణి సంస్థను క్రమంగా పక్కనబెట్టి, కొందరికి లబ్ధి చేకూర్చేలా వ్యవహరించారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. యాదాద్రి ప్లాంటులో విద్యుత్ ఉత్పత్తి వ్యయం ఇతర కేంద్రాలతో పోలిస్తే భారీగా పెరిగిందని, దీనివల్ల ప్రజలపై అదనపు భారం పడుతోందని ప్రభుత్వం పేర్కొంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఒప్పందాలు, అప్పట్లో ఎన్జీటీలో దాఖలైన పిటిషన్లు అన్నీ సింగరేణికి నష్టం కలిగించేలా ఉన్నాయని కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్నారు.సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటిది. ఇటువంటి కంపెనీపై అధికార, ప్రతిపక్షాల మధ్య జరుగుతున్న ఈ రాజకీయ పోరు సంస్థ ఉనికిని, కార్మికుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోంది. బొగ్గు దిగుమతులు, ఉత్పత్తి పడిపోవడం, అంచనా వ్యయాల పెంపు వంటి అంశాలపై రెండు పార్టీలు పరస్పరం అవినీతి ఆరోపణలు గుప్పించుకోవడం రాష్ట్రంలో రాజకీయ చర్చకు దారితీసింది. ఈ వివాదానికి తెరపడాలంటే సమగ్రమైన నిష్పాక్షిక విచారణ జరిగి, వాస్తవాలు ప్రజల ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది

# రియల్ ఎస్టేట్ కీలక సంస్కరణల
# డిజిటల్ సిగ్నేచర్ పాలసీ !

హైదరాబాద్,అక్టోబరు 19 రియల్ ఎస్టేట్ రంగంలో కొనుగోలుదారుల ప్రయోజనాలను కాపాడటంతో పాటు పారదర్శకతను పెంచేందుకు దేశవ్యాప్తంగా ఉన్న వివిధ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ బోర్డులు కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టాయి. పలు రాష్ట్రాల రేరా అధికారులు క్వార్టర్లీ ప్రోగ్రెస్ రిపోర్టులు , ప్రాజెక్ట్ కంప్లీషన్ సర్టిఫికేట్ల దాఖలులో ఆర్కిటెక్ట్, ప్రాజెక్ట్ ఇంజనీర్ ,చార్టర్డ్ అకౌంటెంట్ ల త్రిసభ్య డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికేట్ వ్యవస్థను తప్పనిసరి చేశాయి. ఈ నూతన విధానం ద్వారా నకిలీ నివేదికలు, అసంపూర్తి సమాచారానికి చెక్ పడనుంది.ఇప్పటివరకు అనేక ప్రాజెక్టుల్లో నిర్మాణాలు ఆలస్యమైనప్పటికీ, కాగితాలపై లేదా పిడిఎఫ్ పత్రాల్లో తప్పుడు పురోగతి నివేదికలను అప్‌లోడ్ చేస్తూ బిల్డర్లు కొనుగోలుదారులను, రేరా వ్యవస్థను మభ్యపెడుతున్నారనే ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీనిని తీవ్రంగా పరిగణించిన రేరా మండళ్లు.. ఇకపై ప్రతి మూడు నెలలకొకసారి సమర్పించే పురోగతి నివేదికల్లో ముగ్గురు నిపుణుల క్లాస్-3 డిజిటల్ సంతకాలు ఉంటేనే సిస్టమ్ ఆమోదించేలా పోర్టల్స్‌ను నవీకరించాయి. దీనివల్ల ఆర్థిక లెక్కలు, భౌతిక నిర్మాణాల పురోగతి మధ్య వ్యత్యాసాలు ఉండటానికి వీల్లేకుండా పక్కాగా నమోదవుతాయి.ఈ కొత్త నిబంధనతో ప్రాజెక్టుల జాప్యానికి అడ్డుకట్ట పడటంతో పాటు రియల్ ఎస్టేట్ బిల్డర్లపై జవాబుదారీతనం గణనీయంగా పెరుగుతుంది. నిర్మాణాల పురోగతిని, ఎస్క్రో ఖాతా నిధుల వినియోగాన్ని తప్పుగా ధృవీకరిస్తే సదరు ఆర్కిటెక్ట్, ఇంజనీర్ లేదా చార్టర్డ్ అకౌంటెంట్లు కూడా చట్టపరంగా, వృత్తిపరంగా బాధ్యత వహించాల్సి ఉంటుంది. తప్పుడు సర్టిఫికేషన్లు ఇస్తే సంబంధిత ప్రొఫెషనల్ కౌన్సిళ్లకు ఫిర్యాదు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి వస్తుండటంతో నిపుణులు కూడా నిష్పక్షపాతంగా, పక్కా ఆధారాలతో నివేదికలు అందించడానికి మొగ్గుచూపుతారు.ఈ డిజిటల్ సిగ్నేచర్ విధానం వల్ల గృహ కొనుగోలుదారులకు తమ ప్రాజెక్ట్ ప్రస్తుత స్థితిపై అత్యంత ఖచ్చితమైన సమాచారం లభిస్తుంది. డెవలపర్లు కస్టమర్ల నుంచి వసూలు చేసిన నిధులను వేరే ప్రాజెక్టులకు మళ్లించకుండా అరికట్టడానికి, సమయానికి ప్లాట్లు, ఫ్లాట్లను హ్యాండోవర్ చేయడానికి ఈ సంస్కరణ ఎంతగానో దోహదపడుతుందని ఆర్థిక, నిర్మాణ రంగ నిపుణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.మొదటి జీతం చేతికి రాగానే భవిష్యత్ అవసరాల పేరుతో పొదుపు మంత్రం జపిస్తూ.. మారుమూల ప్లాట్లకు జీతంలో 60 నుంచి 70 శాతం ఈఎంఐ లుగా చెల్లించే ధోరణి గత ఇరవై ఏళ్లుగా నిరాటంకంగా సాగుతోంది.దేశంలోని ఇతర రాష్ట్రాల యువతతో పోల్చి చూస్తే.. తెలుగువారి జీవనశైలి ప్రాధాన్యతల్లో విస్పష్టమైన వ్యత్యాసం కనిపిస్తుంది. ప్రయాణాలు, పర్యాటకం, వైవిధ్యమైన ఆహార అనుభవాలు, మానసిక ఉల్లాసాన్నిచ్చే లైఫ్‌స్టైల్‌పై ఖర్చు చేయడంలో సగటు తెలుగు ఐటీ ఉద్యోగి ఎప్పుడూ ఒకటికి పదిసార్లు ఆలోచిస్తూ వెనుకడుగు వేస్తాడు. కార్యాలయానికి సమీపంలో ఉండే ఆహ్లాదకరమైన గేటెడ్ కమ్యూనిటీలో అద్దెకు ఉంటూ ప్రశాంతంగా జీవించడం కంటే.. కాస్త అసౌకర్యమైన, దూరపు ప్రాంతాల్లో తక్కువ అద్దెకు ఉండి మిగిల్చిన సొమ్ముతో మరో ఫ్లాట్ లేదా ప్లాట్ కొనాలనే ఆరాటమే ఎక్కువ. పెళ్లి సంబంధాల వేళ అబ్బాయి కెరీర్ గ్రోత్, వ్యక్తిత్వం కంటే హైదరాబాద్‌లో ఎన్ని ప్లాట్లు ఉన్నాయి? సొంత ఫ్లాట్ ఉందా? అనే పాయింట్లే ప్రామాణికంగా మారుతున్నాయి. వివాహానికి ముందు మొదలయ్యే ఈ ఆస్తి వేట.. పెళ్లయిన తర్వాత కూడా ఆగడం లేదు; ఒక ఫ్లాట్ కొంటే ఇంకో ప్లాట్ కొనాలని, అది అయిపోగానే విల్లా కోసం అప్పు చేయాలంటూ కుటుంబాలు, బంధువుల సర్కిల్స్ పరోక్షంగా ఒక రేసును సృష్టిస్తున్నాయి. పక్కవాడితో పోల్చుకుంటూ సమాజంలో హోదా ను నిరూపించుకోవడానికి చేస్తున్న ఈ ఆరాటం ఉద్యోగులను ఆర్థిక సంకెళ్లలో బంధించి, కనీస స్వేచ్ఛ లేకుండా చేస్తోంది.ఇలా సంపాదించిన ఆస్తులు ఎవరి కోసం, దేనికోసం అనే ఆలోచన ఉండటం లేదు. తమ ప్రైమ్ లైఫ్‌ను, ఆరోగ్యాన్ని, మానసిక ప్రశాంతతను బ్యాంకు రుణాల వడ్డీలు కట్టడానికే ధారపోస్తోంది. ముమ్మందు తరాల భవిష్యత్తును భద్రపరుస్తున్నామని అనుకుంటున్నారు. సంపద అంటే కేవలం స్థిరాస్తుల లెక్కలు మాత్రమే కాదని, ఆనందంగా బతికే జీవితం, ఆరోగ్యకరమైన సంబంధాలు, అనుభవాలు కూడా అసలైన సంపదలేనని గుర్తించాల్సిన అవసరం కనిపిస్తోంది

# రోడ్డు ప్రమాదంలో పూజారి మృతి



మేడ్చల్ గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ పరిశ్రమ పూజారి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శారద కృష్ణ (60) గత కొన్నేళ్లుగా మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని చెట్లగౌరారం గ్రామ పరిధిలో ఉన్న ఎంఎస్ అగర్వాల్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో పూజారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి పరిశ్రమ ప్రాంగణంలోనే నివాసం ఉంటున్నారు. ?సోమవారం ఉదయం శారద కృష్ణ తన ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనంపై మేడ్చల్ వైపు వస్తుండగా డబీల్‌పూర్ చౌరస్తా సమీపంలోని పంజాబీ దాబా వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో ఆయన ఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచారు. ?సమాచారం అందుకున్న మేడ్చల్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

## దిగువ ఆహోబిలంలో భారీ అగ్ని ప్రమాదం

నంద్యాల దిగువ అహోబిలంలో ఆదివారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. దేవస్థానం ఎదురుగా బీగాల ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో ప్రమాదం జరిగింది. ఘటన లో ఆరు దుకాణాలు దగ్ధం అయ్యాయి.
మూడు బొమ్మల దుకాణాలు, ఒక కూల్‌డ్రింక్స్ షాప్, రెండు హోటళ్లు దగ్ధం అయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక సమాచారం. మంటలు చెలరేగడంతో స్థానికులు, బాధితులు ఆందోళనకు గురైయారు. పోలీసులు సిలిండర్లను తొలగించడంతో భారీ ప్రాణనష్టం తప్పింది. అగ్నిప్రమాదంలో రూ.50 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు

# తెలంగాణ కరెంట్ సంక్షోభం

హైదరాబాద్,అక్టోబరు 19 తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యలకు పరిష్కారాల కంటే కారణాలను వెదకడానికే ప్రయత్నిస్తోంది. అప్రకటిత విద్యుత్ కోతలు, విద్యుత్ సరఫరాలో తలెత్తుతున్న సాంకేతిక లోపాలపై అధికార కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు తీవ్ర విమర్శలకు దారితీస్తున్నాయి. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ చీఫ్ ఇంజనీర్‌ను సస్పెండ్ చేయడం, ప్లాంట్‌లో ఉత్పత్తి నిరంతర పర్యవేక్షణ కోసం ఏకంగా ఐదుగురు ఐఏఎస్ అధికారులను డిప్యూట్ చేయడం వంటివి సమస్య పరిష్కారానికి కాకుండా.. ఓ నరేషన్ కోసం అన్నట్లు ఉన్నాదన్న అభిప్రాయం వినిపిస్తోంది.అసలు సమస్యకు అధికారులను మాత్రమే బాధ్యులను చేస్తూ ప్రభుత్వం తప్పుకునే ప్రయత్నం చేస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సస్పెండ్ అయిన అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరించారని చెబుతున్న పాలకులు, సదరు అధికారికి గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో సంబంధాలు ఉన్నాయనే అనుమానాలు ఉంటే అసలు అంత కీలకమైన స్థానంలో ఎందుకు కొనసాగించారనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే విద్యుత్ రంగంలో తలెత్తుతున్న ప్రతి సమస్యకూ అధికారుల నిర్లక్ష్యం , గత ప్రభుత్వ సానుభూతిపరుల కుట్ర ఉందనే ప్రకటనలు చేస్తూ వస్తోంది. మొదట్లో నమోదైన అప్రకటిత విద్యుత్ కోతల సమయంలోనూ కొందరు సిబ్బంది కావాలనే కోతలు విధిస్తున్నారనే ఆరోపణలు చేశారు. ఒకవేళ క్షేత్రస్థాయి వ్యవస్థలో అటువంటి అనుమానాలు నిజంగానే ఉంటే, మూడేళ్ల కాలంలో పాలనా వ్యవస్థపై పట్టు సాధించడంలో, తమ మాట వినేలా యంత్రాంగాన్ని సమాయత్తం చేయడంలో ప్రభుత్వం ఎందుకు విఫలమైందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.విద్యుత్ సంక్షోభం , ప్లాంట్లలో ఉత్పత్తి మందగమనానికి కేవలం ఒక్క అధికారిని సస్పెండ్ చేసి, ఐఏఎస్ అధికారులను పర్యవేక్షణకు పంపితే సమస్య శాశ్వతంగా పరిష్కారం కాదని రంగానికి చెందిన నిపుణులు విశ్లేషిస్తున్నారు. బొగ్గు సరఫరా వ్యవస్థ, భోపాల్ హెవీ ఎలక్ట్రికల్స్ పనుల పురోగతి, మెయింటెనెన్స్ సమస్యలు , బొగ్గు బంకర్లలో తలెత్తుతున్న సాంకేతిక లోపాలు వంటి అనేక కార్యాచరణ సవాళ్లను సమర్థవంతంగా నిర్వహించడంలో విఫలమై, చివరకు నిందను అధికారులపై నెట్టేయడం సమర్థనీయం కాదని విమర్శకులు మండిపడుతున్నారు. సమర్థులైన అధికారులను సరైన స్థానాల్లో నియమించుకోలేకపోవడం , పాలనాపరమైన పర్యవేక్షణ కొరవడటం ప్రభుత్వ నిర్వహణా లోపమే తప్ప వేరొకటి కాదనే వాదన బలంగా వినిపిస్తోంది.రాజకీయ ఆరోపణలు, సస్పెన్షన్ల చర్యలు కేవలం కారణాలు అవుతాయి కానీ.. పరిష్కారం కాదు. విద్యుత్ డిమాండ్‌కు తగ్గట్లుగా ఉత్పత్తిని పెంచడంపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ప్రతి లోపానికీ అధికారులను లేదా ప్రతిపక్షాలను బాధ్యులను చేస్తూ పోతే, అది ప్రభుత్వ ప్లానింగ్ లోపాలను కప్పిపుచ్చే ప్రయత్నంగానే ప్రజలు భావిస్తారు. ప్రజలు వాతావరణ పరిస్థితుల్ని .. ఎల్‌నినోను అంచనా వేసి పాపం ప్రభుత్వం అనుకోరు. ఎందుకంటే వారికి కష్టం వస్తే ప్రభుత్వాన్నే మొదట తిట్టుకుంటారు.

# పంటల మార్పిడి సాధ్యమేనా.

నిజామాబాద్,,అక్టోబరు 19 తెలంగాణలో రబీ వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లించాలని ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు క్షేత్రస్థాయిలో అనేక సవాళ్లు ఎదురయ్యేలా ఉన్నాయి. గత దశాబ్ద కాలంలో రాష్ట్రంలో వరి సాగు విస్తీర్ణం నాలుగు రెట్లకు పైగా పెరగడంతో.. ఇప్పుడు పంటల మార్పిడి అంత సులభం కాదని నిపుణులు అంటున్నారు. సాగునీటి ప్రాజెక్టుల విస్తరణ, ప్రభుత్వ ధాన్యం కొనుగోలు భరోసా, రైతుల ప్రాధాన్యం వెరసి వరి తెలంగాణలో ప్రధాన రబీ పంటగా స్థిరపడిందని చెబుతున్నారు.అయితే, రానున్న కాలంలో నీటి లభ్యతపై ఆందోళనలు, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం వంటి అంశాలు ప్రభుత్వం పంటల మార్పిడిపై దృష్టి సారించేలా చేస్తున్నాయి.కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం.. 2023?24 రబీ సీజన్‌లో తెలంగాణలో 52.02 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ప్రధాన రబీ వరి సాగు రాష్ట్రాల మొత్తం విస్తీర్ణంలో ఇది 51.38 శాతంగా ఉంది. ఈ జాబితాలో తమిళనాడు 29.13 లక్షల ఎకరాలతో, ఆంధ్రప్రదేశ్ 14.16 లక్షల ఎకరాలతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. కేరళలో 1.78 లక్షల ఎకరాలు, ఇతర రాష్ట్రాల్లో కలిపి మరో 4.15 లక్షల ఎకరాల్లో రబీ వరి సాగైనట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.రాష్ట్రంలో వరి సాగు విస్తీర్ణం పెరిగిన తీరు ఈ మార్పును మరింత స్పష్టం చేస్తోంది. 2014?15లో తెలంగాణలో 12.23 లక్షల ఎకరాల్లో మాత్రమే రబీ వరి సాగు కాగా.. 2023?24 నాటికి ఆ విస్తీర్ణం 52.16 లక్షల ఎకరాలకు చేరింది. సాగునీటి సౌకర్యాలు మెరుగు పడటం, వరి సాగుపై రైతులకు ఉన్న అనుభవం, ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందనే భరోసా ఈ పెరుగుదలకు ప్రధాన కారణాలుగా భావిస్తున్నారు. వరి సాగుతో రైతులకు మార్కెట్‌పై కొంత స్పష్టత ఉండటం కూడా ఇతర పంటల వైపు మళ్లేందుకు వెనుకంజ వేయడానికి కారణమవు తోంది.ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది మార్చి 4 నాటికి రాష్ట్రంలో 57.32 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. గత ఏడాది ఇదే సమయానికి నమోదైన 55.36 లక్షల ఎకరాలతో పోలిస్తే ఇది 3.5 శాతం అధికం. రబీ సాగును తగ్గించాలని ప్రభుత్వం సూచిస్తున్నప్పటికీ.. రైతుల స్థాయిలో వరి పంటపై ఆధారపడటం ఇంకా కొనసాగు తోందని ఈ గణాంకాలు సూచిస్తు న్నాయి.రైతులు పప్పుధాన్యాలు, నూనెగింజలు, తక్కువ నీటితో పండే ఇతర పంటలను పరిశీలించాలని రైతు కమిషన్ సభ్యుడు ఎస్. అన్వేష్ రెడ్డి సూచించారు. అయితే.. పంట మార్పిడి విజయవంతం కావాలంటే రైతులకు సూచనలు ఇవ్వడమే సరిపోదని నిపుణులు అభిప్రాయపడు తున్నారు. ప్రత్యామ్నాయ పంటలకు గిట్టుబాటు ధరలు, స్థిరమైన కొనుగోలు వ్యవస్థ, నాణ్యమైన విత్తనాల లభ్యత, మార్కెట్‌పై భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. నీటి వనరుల పరిరక్షణతో పాటు రైతుల ఆదాయానికి భంగం కలగకుండా పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించడం కీలకమని అంటున్నారు.

# మెట్రోకు ఆరు నెలల్లో రూ.405 కోట్ల లోటు

హైదరాబాద్,అక్టోబరు 19 హైదరాబాద్ మెట్రోరైలు ఆర్థిక కష్టాలు కొనసాగుతున్నాయి. మెట్రో మొదటి దశ ప్రాజెక్టును ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నప్పటికీ స్వాధీన ప్రక్రియలో ప్రతిష్టంభన కొనసాగుతోంది. మరోవైపు మెట్రో ఆదాయం కొంత పెరిగినా.. ఖర్చులు అంతకంటే ఎక్కువగా ఉండటంతో నష్టాలు మరింత విస్తరిస్తున్నాయి. 2026 సెప్టెంబరు 30తో ముగిసిన ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రోరైలు రూ.405.86 కోట్ల నష్టాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో రూ.380.46 కోట్ల నష్టం నమోదైంది. అంటే ఏడాది వ్యవధిలో అర్ధ వార్షిక నష్టాలు రూ.25.40 కోట్లు పెరిగాయి. మెట్రో నిర్వహణను ప్రభుత్వం చేపట్టాలన్న ప్రతిపాదనకు ఆర్థికపరమైన అంశాలు కీలకంగా మారుతున్నాయి.ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు ఆరు నెలల్లో మెట్రోరైలు కార్యకలాపాలు, ఇతర ఆదాయ మార్గాల ద్వారా మొత్తం రూ.524.78 కోట్ల ఆదాయం సమకూరింది. గత ఏడాది ఇదే కాలంలో వచ్చిన రూ.497.54 కోట్లతో పోలిస్తే ఆదాయం రూ.27.24 కోట్లు పెరిగింది. ప్రయాణికుల రవాణా, ఇతర కార్యకలాపాల ద్వారా ఆదాయం పెరిగినప్పటికీ, పెరుగుతున్న నిర్వహణ వ్యయాలను అధిగమించడానికి అది సరిపోవడం లేదు. ఇదే సమయంలో మెట్రో నిర్వహణ ఖర్చులు, ఉద్యోగుల జీతభత్యాలు, పరిపాలనా వ్యయాలు, నిర్మాణ సంబంధిత ఖర్చులు, రుణాలపై వడ్డీలు, తరుగుదల కలిపి ప్రస్తుత అర్ధ సంవత్సరంలో రూ.930.64 కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంలో ఈ వ్యయాలు రూ.878 కోట్లుగా ఉన్నాయి. దీంతో ఆదాయం, వ్యయాల మధ్య అంతరం మరింత పెరిగింది.మెట్రోరైలు ఆర్థిక పరిస్థితిపై రుణాల వడ్డీ భారం తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లోనే ఫైనాన్స్ ఖర్చులు రూ.522.61 కోట్లకు చేరాయి. మరోవైపు మెట్రో రైళ్ల నిర్వహణకు సంబంధించిన ఖర్చులు రూ.222.88 కోట్లుగా నమోదయ్యాయి. మెట్రోకు వస్తున్న ఆదాయంలో గణనీయమైన భాగం రుణాల వడ్డీల చెల్లింపులకే వెచ్చించాల్సి వస్తోంది. దీంతో నిర్వహణ ఆదాయం పెరిగినా మొత్తం ఆర్థిక ఫలితాల్లో మెరుగుదల కనిపించడం లేదు.మెట్రో మొదటి దశ ప్రాజెక్టు కోసం తీసుకున్న రుణాలపై ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో సగటున 7 నుంచి 8 శాతం వరకు వడ్డీ చెల్లిస్తోంది. ఈ ప్రాజెక్టును ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియలో భాగంగా రుణాలను రీషెడ్యూల్ చేసి వడ్డీ భారాన్ని తగ్గించాలనేది ప్రభుత్వ వ్యూహంగా ఉంది. వడ్డీ రేటును 3.5 నుంచి 4 శాతం లోపునకు తగ్గించగలిగితే మెట్రో ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని భావిస్తున్నారు. ఇందుకోసం తక్కువ వడ్డీ రేట్లకు రుణాలను పునర్వ్యవస్థీకరించేందుకు ముందుకొచ్చే బ్యాంకుల అన్వేషణ బాధ్యతను ఎస్‌బీఐ క్యాప్స్‌కు అప్పగించారు.ప్రస్తుత అర్ధ వార్షిక గణాంకాల ప్రకారం మెట్రోపై రుణాల వడ్డీ భారం రోజుకు సగటున సుమారు రూ.2.85 కోట్లుగా ఉంటోంది. ఈ భారాన్ని తగ్గించడంతో పాటు ఆదాయ మార్గాలను పెంచడం, నిర్వహణ వ్యయాలను సమర్థంగా నియంత్రించడం ద్వారా మాత్రమే మెట్రో ఆర్థిక పరిస్థితిలో గణనీయమైన మార్పు సాధ్యమవుతుంది. ప్రభుత్వం స్వాధీన ప్రక్రియను ఎప్పుడు పూర్తి చేస్తుంది, రుణాల పునర్వ్యవస్థీకరణకు ఏ మేరకు అనుకూల నిబంధనలు లభిస్తాయన్న అంశాలపై మెట్రో భవిష్యత్తు ఆధారపడి ఉంది.

# చైతన్యపురిలో సాఫ్ట్ వేర్ ఉద్యోగి బలవన్మరణం



హైదరాబాద్ చైతన్యపురి పోలీస్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. తమ్మిశెట్టి ప్రవీణ్ (34) అనే సాఫ్ట్ వేర్ ఉద్యోగి, మూడు నెలల క్రితమే వివాహం చేసుకున్నారు. షేర్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టి నష్టపోవడంతో, కుటుంబ సభ్యులు, బంధువుల వద్ద పరువు పోతుందనే ఆందోళనతో చైతన్యపురిలోని ఓ భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడడం జరిగింది. సమాచారం అందుకున్న చైతన్యపురి పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేయడం జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

## శాతవాహన యూనివర్సిటీలో 49 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి అనుమతి: మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్ తెలంగాణ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు.తొలి విడతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఏడు విశ్వవిద్యాలయాల్లో మొత్తం 429 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను ప్రత్యక్ష నియామకాల ద్వారా భర్తీ చేయనుండగా, శాతవాహన యూనివర్సిటీ పరిధిలో 49 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతినిచ్చిందని మంత్రి తెలిపారు. ఈ నియామకాలకు సంబంధించి రాష్ట్ర ఆర్థిక శాఖ జీవో నంబర్లు 141, 142లను విడుదల చేసిందని, కామన్ గైడ్‌లైన్స్ మరియు రోస్టర్ విధానానికి అనుగుణంగా ఈ నెలాఖరు నాటికి నోటిఫికేషన్లు వెలువడనున్నాయని పేర్కొన్నారు.శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని వివిధ కళాశాలల్లో ఖాళీల వివరాలు:యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ హుస్నాబాద్:కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ 7,సిఎస్ సి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ 7, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ 7,ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ 5, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ 1, మెకానికల్ ఇంజినీరింగ్ 2, ఇంగ్లీష్ 1, మ్యాథమెటిక్స్: 2 ఫిజిక్స్ 2, కెమిస్ట్రీ 2, ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్1, లైబ్రేరియన్ 1,యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లా యూనివర్సిటీ క్యాంపస్ లా న్యాయశాస్త్రం 8, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఎల్ఎండీ క్యాంపస్, ఫార్మసీ 2, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ యూనివర్సిటీ క్యాంపస్: కామర్స్ 1ఈ పోస్టుల భర్తీ ద్వారా ఉన్నత విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు నాణ్యమైన విద్యాబోధన అందుబాటులోకి వస్తుందని మంత్రి వివరించారు. అర్హత గల నిరుద్యోగ యువత ఈ నియామక అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు

# కోదాడలో దారుణం.. తల్లి దాడిలో తొమ్మిదేళ్ల బాలిక మృతి



సూర్యాపేట కన్నతల్లి దాడిలో తొమ్మిదేళ్ల చిన్నారి జాస్మిన్ మృతి చెందింది. ఆడుకుంటున్న బాలికపై రాయితో దాడి చేసినట్లు ప్రాథమిక సమాచారం. తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చేరిన చిన్నారి, చికిత్స పొందుతూ మృతి చెందింది.

తల్లి సైరాబానుకు మానసిక సమస్యలు ఉన్నట్లు బంధువులు వెల్లడించారు. భర్తకు దూరంగా ఉంటున్న తల్లి, కుమార్తెలు బంధువుల ఇంట్లో వుంటున్నారు. ఘటనపై మేనమామ ఫిర్యాదుతో కేసు నమోదు అయింది. కోదాడ పట్టణ పోలీసులు ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

# హైదరాబాద్ పాతబస్తీలో భారీ అగ్నిప్రమాదం

హైదరాబాద్ పాతబస్తీ మదీనా ప్రాంతంలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది.

హైకోర్టుకు ఎదురుగా మదీనా క్రాస్ రోడ్ వద్ద ఉన్న బాంబే హోజరీ వస్త్ర దుకాణం, గోదాంలో అగ్నిప్రమాదం జరిగింది.

భవనంలోని రెండో అంతస్తులో మంటలు భారీగా చెలరేగాయి.

సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, చార్మినార్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. హోల్ సేల్ క్లాత్ మార్కెట్ కావడంతో భారీ ఎత్తున నష్టం ఉండే అవకాశం ఉంటుందని అధికారులు అంటున్నారు.

## బాటసింగారంలో రోడ్డు ప్రమాదం.. 20 మందికి గాయాలు

రంగారెడ్డి అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాటసింగారం వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఖమ్మం డిపో ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో సుమారు 40 మంది ప్రయాణికులు వున్నారు. సుమారు 20 మందికి గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను వనస్థలిపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

# వివేకానంద నగర్ లో సద్దుల బతుకమ్మ వేడుకలు

కూకట్ పల్లి నియోజకవర్గ గాయత్రీ నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ వివేకానంద నగర్ లో వేముల సత్యం, స్రవంతి ఆధ్వర్యంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకలకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయని దీనిలో భాగంగా ఇక్కడ నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన అభినందించారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలందరూ పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని వెల్లడించారు. ఆయుధపూజ, శమీ పూజ చేసి అమ్మవారిని పూజిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం తో పాటు ప్రజలందరూ బాగుండాలని పంటలు వర్షాలు సుభిక్షంగా పండాలని ఆయన కోరుకున్నట్లు తెలిపారు.

# దేవుడి ముందు సమానత్వం ఎక్కడ?

## సి.హెచ్. ప్రతాప్

దేవుడి సన్నిధిలో అందరూ సమానమేనని చెబుతాం. కానీ కొన్ని ఆలయాల్లో పండుగల వేళ కనిపిస్తున్న దృశ్యాలు ఆ విశ్వాసాన్నే ప్రశ్నిస్తున్నాయి. ప్రముఖులకు ప్రత్యేక స్వాగతాలు, దాతలకు సత్వర దర్శనాలు, ఖరీదైన టికెట్లు కొనేవారికి సులభ ప్రవేశాలు లభిస్తుంటే, సామాన్య భక్తుడు మాత్రం గంటల తరబడి క్యూలో నిరీక్షిస్తున్నాడు. దైవదర్శనానికి భక్తికంటే హోదా, ధనమే అర్హతలుగా మారుతున్నాయా? ఆలయ నిర్వహణలో ఈ ప్రశ్నకు నిజాయతీతో కూడిన సమాధానం అవసరం.

పండుగరోజు తన ఇష్టదైవాన్ని దర్శించుకోవాలనే కోరికతో సామాన్యుడు కుటుంబంతో ఆలయానికి వస్తాడు. ప్రయాణానికి, వసతికి తన శక్తికి మించి ఖర్చు చేస్తాడు. వృద్ధులు, చిన్నారులతో క్యూలో నిలబడతాడు. తీరా దర్శనం సమీపించే సమయంలో ప్రముఖుల రాకతో సాధారణ వరుసలను నిలిపివేస్తే, అతడి నిరీక్షణకు అంతులేకుండా పోతుంది. చివరకు క్షణకాలం దర్శనమిచ్చి ముందుకు నెట్టేస్తే, ఆ భక్తుడి మనసులో మిగిలేది ఆధ్యాత్మిక ప్రశాంతతా, అవమానభారమా? ఈ వ్యత్యాసాన్ని ప్రశ్నించడం భక్తికి విరుద్ధం కాదు.

ఆలయాల నిర్వహణకు నిధులు అవసరమే. దాతల సహకారమూ విలువైనదే. అయితే విరాళానికి కృతజ్ఞత తెలియజేయడం, ఇతర భక్తుల దర్శనావకాశాన్ని తగ్గించడం ఒకటి కాదు. దానం సేవాభావాన్ని పెంచాలి; ప్రత్యేక హక్కుల కొనుగోలుగా మారకూడదు. సామాన్యుడి చిన్న కానుకలోనూ అతడి శ్రమ, విశ్వాసం ఉంటాయి. పెద్ద మొత్తాన్ని సమర్పించలేనంత మాత్రాన అతడి భక్తి విలువ తగ్గిపోదు. ఆలయ పాలకులు ఈ సత్యాన్ని తమ నిర్ణయాల్లో ప్రతిబింబింపజేయాలి.

భద్రతాపరమైన అవసరాలతో కొన్ని ప్రత్యేక ఏర్పాట్లు తప్పకపోవచ్చు. కానీ వాటి పేరుతో సాధారణ భక్తుల సమయాన్ని అపరిమితంగా తీసుకునే అధికారం ఎవరికీ లేదు. ప్రముఖుల దర్శనాలకు నిర్ణీత సమయాలు కేటాయించాలి. రద్దీ ఎక్కువగా ఉండే పర్వదినాల్లో విచక్షణారహిత ప్రత్యేక ప్రవేశాలను నియంత్రించాలి. సాధారణ దర్శనం నిరంతరంగా సాగేలా ఏర్పాట్లు చేయాలి. భక్తులు ఎంతసేపు వేచి ఉండాలో స్పష్టమైన సమాచారం అందించాలి. అనూహ్యమైన అంతరాయాలకు కారణాలను తెలియజేయాలి.

చెల్లింపు దర్శనాల ద్వారా వచ్చే ఆదాయంలో తగిన భాగాన్ని ఉచిత దర్శన సదుపాయాల మెరుగుదలకు వినియోగించాలి. క్యూలలో తాగునీరు, నీడ, మరుగుదొడ్లు, కూర్చునే సౌకర్యాలు ఉండాలి. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులు, చిన్నపిల్లలతో వచ్చినవారికి అవసరాధారిత సహాయం అందించాలి. ప్రత్యేక శ్రద్ధకు కొలమానం పలుకుబడి కాకుండా అవసరం కావాలి. భక్తులతో మర్యాదగా వ్యవహరించేలా సిబ్బందికి శిక్షణ ఇవ్వాలి. ఫిర్యాదులకు స్పందించే బాధ్యతగల అధికారులు అందుబాటులో ఉండాలి.

ఆలయ ప్రతిష్ఠను ప్రముఖుల సందర్శనలతో, విరాళాల పరిమాణంతో మాత్రమే కొలవకూడదు. సామాన్య భక్తుడు ఎంత గౌరవంగా దర్శనం చేసుకుని తిరిగివెళ్లాడన్నదే అసలైన ప్రమాణం. పేదవాడిని గంటల తరబడి నిలబెట్టి, సంపన్నుడికి సకల మర్యాదలు చేయడం ఆధ్యాత్మిక విలువలకు విరుద్ధం. భగవంతుని ముందు మనుషుల మధ్య దూరాలు తగ్గాలి. అక్కడే అధికారపు అంతరాలు పెరిగితే, ఆలయ వ్యవస్థ తన లక్ష్యాన్ని పునఃపరిశీలించుకోవాలి.

సమర్థమైన నిర్వహణ అంటే ఎక్కువ టికెట్లు అమ్మడం మాత్రమే కాదు; అందుబాటులోని సమయాన్ని, సదుపాయాలను న్యాయంగా పంచడం. ఉచిత దర్శనానికి వచ్చే భక్తుడిని ఆదాయం తీసుకురాని వ్యక్తిగా చూడకూడదు. అతడే ఆలయ సంప్రదాయానికి జీవం. అతడి విశ్వాసమే దాని బలం. ఆ విశ్వాసాన్ని కాపాడటం పాలకమండళ్ల ప్రథమ కర్తవ్యం. ప్రత్యేకతకు పరిమితి ఉండాలి; సామాన్యుడి గౌరవానికి ఎలాంటి పరిమితీ ఉండకూడదు. దేవుడు అందరివాడైతే, ఆయన దర్శనంలోనూ ఆ సమానత్వం కనిపించాలి.

# అవినీతి అక్రమాలపై రాజీలేని పోరాటం

## బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్య సభ సభ్యులు ఆర్.కృష్ణయ్య పిలుపు

హైద్రాబాద్ అక్టోబర్ 29;విజయ దశిమి పండుగ స్ఫూర్తితోఅవినీతి అక్రమాలపై రాజీలేని పోరాటం చేస్తూ రాజ్యాధికారం లక్ష్యంగా బిసిలు రాజీ లేని పోరాటం చేయాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్య సభ సభ్యులు ఆర్.కృష్ణయ్య పిలుపు నిచ్చారు.విజయ దశమి పర్వదినంసందర్భంగా బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ నరేష్ ముదిరాజ్ ఆద్వర్యం లో బిసి భవన్ లో అర్. కృష్ణయ్య ను కలిసి శాలులతో సన్మానించి అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపేష్ సాగర్, రాజేందర్, అనంతయ్య, మంగలి వినేయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# విజయదశమి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నర్ శుభాకాంక్షలు

హైదరాబాద్, అక్టోబర్ 19,2026:విజయదశమి పర్వదినం సందర్భంగా తెలంగాణ ప్రజలందరికీ రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా శుభాకాంక్షలు తెలియజేశారు.

ధర్మంపై అధర్మం, సత్యంపై అసత్యం, మంచిపై చెడు సాధించిన విజయానికి విజయదశమి ప్రతీకగా నిలుస్తుందని గవర్నర్ పేర్కొన్నారు. ఈ పర్వదినం ప్రతి ఒక్కరిలో ధైర్యం, ధర్మనిష్ఠ, సత్ప్రవర్తన, సానుకూల దృక్పథాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు.

దుర్గామాత ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం శాంతి, సౌభాగ్యం, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ప్రజలందరి జీవితాల్లో విజయం, ఆనందం వెల్లివిరియాలని గవర్నర్ ఆకాంక్షించారు. సమైక్యత, పరస్పర గౌరవం, సామాజిక బాధ్యతతో ప్రగతిశీల తెలంగాణ పురోగతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఘనంగా బతుకమ్మ వేడుకలు

## ఆటపాటలతో సందడి చేసిన ఓబిసి రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు వాణి రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 19: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు చైతన్యపురి కమలానాగర్ చౌరస్తా లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు, ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమానికి
ఓబిసి రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు వాణి రెడ్డి హాజరై బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. మహిళలంతా ఒకచోట చేరి ఉత్సాహంగా బతుకమ్మ వేడుకలు జరుపుకోవడం పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే





బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, ఆత్మీయ అనుబంధాలకు ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా వాణి రెడ్డి పేర్కొన్నారు. మహిళల కోలాటాలు, బతుకమ్మ పాటలతో వేడుకల ప్రాంగణం సందడిగా మారింది. రంగు రంగుల వస్త్రాలు దసరించిన మహిళలు పిల్లల భాగస్వామ్యంతో బతుకమ్మ వేడుకలు పండుగ శోభను సంతరించుకున్నాయి.

# అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక నవరాత్రి ఉత్సవాలు: గవర్నర్

## -నవరాత్రి వేడుకల్లో పాల్గొన్న గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



హైదరాబాద్, అక్టోబరు 19,2026: నవరాత్రి ఉత్సవాలు అధర్మంపై ధర్మం, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకలని రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలిచే ఈ పర్వదినాలు భక్తిభావాన్ని, ధర్మనిష్ఠను పెంపొందిస్తాయని తెలిపారు.

సోమవారం సైనిక్‌పురిలోని శృంగేరి శంకరమఠం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ శారదా శరణ్ నవరాత్రోత్సవాల్లో, హైదరాబాద్‌లోని సమృద్ధి లోక్‌భవన్ ఉద్యోగుల నివాస సముదాయంలో నిర్వహించిన శ్రీ దేవి నవరాత్రి వేడుకల్లో గవర్నర్ పాల్గొన్నారు.



ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరికీ సుఖసంతోషాలు కలగాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, సమాజంలో శాంతి, సామరస్యం వెల్లివిరియాలని ప్రార్థించారు.

దుర్గాదేవి ఆరాధనకు విశేష ప్రాధాన్యమున్న నవరాత్రి పర్వదినాలు ప్రజల్లో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతోపాటు సత్యం, ధర్మం పట్ల నిబద్ధతతో జీవించేందుకు స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. ఇటువంటి పండుగలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు, సమాజంలో ఐక్యతా భావాన్ని బలోపేతం చేయడానికి దోహదపడతాయని తెలిపారు.

ఈ కార్యక్రమాల్లో ఉత్సవాల నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

# పీహెచ్‌సీలో వైద్య సేవలపై రాష్ట్ర ఆరోగ్యశాఖ డైరెక్టర్ ఆరా

## సమయపాలన పాటిస్తూ పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

# డాక్టర్ వెంకట రమణ

సి.బెళగల్, :కర్నూలు జిల్లా సి.బెళగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ వెంకట రమణ సోమవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఇన్‌పేషెంట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే, వైద్యులు, సిబ్బంది మరింత బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు.ఆసుపత్రిలోని నవజాత శిశు సంరక్షణ గది, మందుల విభాగం, ప్రయోగశాల (ల్యాబ్)లను పరిశీలించారు. రికార్డులు, నివేదికలు, రిజిస్టర్లను తనిఖీ చేసి, వాటి నిర్వహణ తీరును సమీక్షించారు. వైద్యులు, సిబ్బంది విధులకు సకాలంలో హాజరై సమయపాలన పాటించాలని, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. రోగులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు.ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతోపాటు, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచించారు. గర్భిణులు, చిన్నారులకు సంబంధించిన ఆరోగ్య వివరాలు, వారికి అందిస్తున్న సేవలను వంద శాతం ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు. క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, అసంక్రమిత వ్యాధులకు సంబంధించిన సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈ తనిఖీలో జిల్లా క్షయ, కుష్ఠు, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ భాస్కర్, సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, సి.బెళగల్ వైద్యాధికారి డాక్టర్ మిథున్ కుమార్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మిగనూరు మున్సిపల్ చైర్మన్ పదవికి స్వతంత్ర అభ్యర్థి నవీన్ కుమార్ రెడ్డి నామినేషన్

### - ప్రజా సమస్యల పరిష్కారం, పట్టణ అభివృద్ధే లక్ష్యంగా ముందడుగు

ఎమ్మిగనూరు, అక్టోబర్ 19 ఎమ్మిగనూరు మున్సిపాలిటీ చైర్మన్ పదవికి స్వతంత్ర అభ్యర్థిగా నవీన్ కుమార్ రెడ్డి ఆదివారం మధ్యాహ్నం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను సమర్పించారు.పట్టణ ప్రజలకు మెరుగైన మున్సిపల్ సేవలు అందించడం, స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయడం లక్ష్యంగా ఆయన చైర్మన్ పదవికి నామినేషన్ దాఖలు చేశారు.ఎమ్మిగనూరు పట్టణంలో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, వీధి దీపాల ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో ప్రజలకు నిత్యం ఎదురయ్యే సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు మున్సిపల్ సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా పనిచేయాలన్నది తన లక్ష్యమని నవీన్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.పట్టణంలోని అన్ని వార్డులకు సమాన ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి చొరవ చూపడం, మున్సిపల్ పరిపాలనలో ప్రజలకు అందుబాటులో ఉండటం ద్వారా పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన భావిస్తున్నారు.స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ సమర్పించిన నవీన్ కుమార్ రెడ్డి, ప్రజా సమస్యల పరిష్కారం మరియు మెరుగైన పౌర సేవల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ తన ముందడుగు వేశారు.

# భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

## జంబి గద్దె, పిల్లి గుండ్ల అమ్మవారి ఆలయాల వద్ద ఏర్పాట్ల పరిశీలన

## భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు - చైర్మన్ పుల్కం రాజు

ప్రజాబలం ప్రతినిధి వేములవాడ సెప్టెంబర్-19 వేములవాడ పట్టణంలోని మంగళవారం రోజున జరిగే పండుగకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే లక్ష్యంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఇందులో భాగంగా జంబి గద్దె, పిల్లి గుండ్ల అమ్మవారి ఆలయాలతో పాటు దేవుని సేవ తిరిగే ప్రాంతాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లను కౌన్సిలర్లతో కలిసి ఆయన పరిశీలించారు. భక్తుల సౌకర్యాలు, పరిసరాల పరిశుభ్రత,





రహదారులపై రాకపోకలకు ఆటంకాలు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ పండుగకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జంబి గద్దె వద్ద మున్సిపల్ సిబ్బందితో పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేయిస్తున్నామని తెలిపారు. దేవుని సేవ తిరిగే మార్గాల్లో రహదారులకు ఇరువైపులా ఉన్న చెట్లు, విద్యుత్ వైర్లు, వాటర్ పైప్‌లైన్ల కారణంగా భక్తులకు, స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు. భక్తుల సౌకర్యమే ప్రథమ ప్రాధాన్యం పండుగ సమయంలో పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంతో పాటు భక్తుల రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడటం అధికారుల బాధ్యత అని చైర్మన్ స్పష్టం చేశారు. ఏర్పాట్లను ముందుగానే క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవడం ద్వారా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించవచ్చని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అవసరమైన ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.ప్రజల అవసరాలను గుర్తించి, పండుగల సమయంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా ఏర్పాట్లను పర్యవేక్షించడం పట్ల స్థానికంగా సానుకూలత వ్యక్తమవుతోంది. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సంబంధిత అధికారులకు సూచనలు చేయడం ద్వారా ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న చైర్మన్ పుల్కం రాజు చొరవ భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు దోహదపడనుంది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అన్నారం శ్రీనివాస్, కొక్కుల బాలకృష్ణ, మైలారం శ్రీనివాస్, ఎలా శ్రీనివాస్, తోట రాజు, కొండ రాజశేఖర్, ఆలయ అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి లో ట్రాఫిక్ కష్టాలు

## - 108 అంబులెన్స్ కూడా ముందుకు కదలలేని పరిస్థితి

శ్రీకాళహస్తి పట్టణంలో ఉదయం నుంచి తీవ్ర ట్రాఫిక్ జామ్ నెలకొంది. ప్రధాన రహదారిలో వాహనాలు గంటల తరబడి నిలిచిపోవడంతో పట్టణ వాసులు, ఆలయానికి వచ్చిన భక్తులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర సర్వీసు అయిన 108 అంబులెన్స్ సైతం ట్రాఫిక్ లో చిక్కుకుపోయింది. ముందు ఆర్టీసీ బస్సు, కార్లు, ఆటోలు బారులు తీరడంతో అంబులెన్స్ ముందుకు వెళ్లలేక నిలిచిపోయింది. అత్యవసర సమయంలో అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితి ఉండటం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శ్రీకాళహస్తీశ్వర ఆలయ



దర్శనానికి వచ్చిన భక్తులు ట్రాఫిక్ లో చిక్కుకున్నారు.చిరు వ్యాపారుల బండ్లు రోడ్డుపైకి రావడం, వాహనాల రద్దీ పెరగడం ట్రాఫిక్ కు ప్రధాన కారణంగా తెలుస్తోంది. వెంటనే ట్రాఫిక్ పోలీసులు స్పందించి ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించాలని, ముఖ్యంగా అత్యవసర వాహనాలకు దారి కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన దారపనేని



కనిగిరి అక్టోబర్ 19 కనిగిరి నియోజకవర్గ ప్రజలకు, తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దారపనేని మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా అశ్వయుజ శుద్ధ దశమి రోజున విజయదశమి (దసరా) పండుగను జరుపుకుంటారని, తొమ్మిది రోజులు శరన్నవరాత్రుల తో పాటు భక్తులు అమ్మవారిని ఆరాధిస్తారని, పదవ రోజున దుర్గాదేవి మహిషాసురుడిని వధించి లోకానికి రక్షణ కల్పించిన సందర్భాన్ని విజయదశమి గా జరుపుకుంటారని, అశ్వయుజ దశమి శ్రవణా నక్షత్రంతో కూడి ఉన్నందున దీనికి విజయ అనే పేరు వచ్చిందని, ఈరోజు ఏ కొత్తపనినైనా ప్రారంభిస్తే విజయం తథ్యం అని నమ్ముతారని, విజయదశమి రోజున జమ్మి చెట్టును పూజించి, జమ్మి బంగారం పంచుకోవడం మన సాంప్రదాయమని, ఇది ఐశ్వర్యాన్ని పరస్పర బంధాలను బలపరుస్తుందని, దసరా పండుగ రోజున పాలపిట్టను చూడడం అత్యంత శుభప్రదంగా భావిస్తారని దారపనేని పేర్కొన్నారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆనందోత్సవాలతో దసరా పండుగను జరుపుకోవాలని దారపనేని ఆకాంక్షించారు.

# త్రాగునీటికి ప్రాధాన్యం ఇవ్వాల

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

## నీటిని పొదుపుగా వాడుకోవాలి

## ఈర్లపూడి చెరువును పరిశీలించిన మంత్రి

ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 19:నీటిని పొదుపుగా, జాగ్రత్తగా వాడుకోవాలని, తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.

మంత్రి సోమవారం రఘునాథపాలెం మండలం ఈర్లపూడి చెరువును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నాగార్జున సాగర్ జలాల ఆధారంగా, మంచుకొండ లిఫ్ట్ ద్వారా నీటిని విడుదల చేసి ఈర్లపూడి చెరువును నింపడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం ఎల్నినో ప్రభావం తీవ్రంగా ఉన్నందున, రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉందన్నారు.





అలాగే సమీప కాలంలో వర్షాలు పడే సూచనలు తక్కువగా ఉన్నందున నీటిని ఎంతో జాగ్రత్తగా, పొదుపుగా వినియోగించుకోవాలని రైతులకు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చెరువులోని నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇస్తూ వాడుకోవాలని సూచించారు.

రైతులు నీటి అవసరం చాలా తక్కువతో సాగయ్యే ఆరుతడి పంటలు సాగు చేయాలని, వరి, మొక్కజొన్న లాంటి పంటలు సాగుచేయవద్దని సూచించారు. ఎల్నినో ప్రభావంతో వర్షాలు పడకపోవడంతో పాటు, ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలు ఉన్నాయని, నీరు, కరంట్ కొరత ఏర్పడే ప్రమాదం ఉందని మంత్రి అన్నారు. ప్రజలకు, పశు పక్ష్యాదులకు త్రాగునీరు ఎంతో ముఖ్యమని, నీటిని, కరంట్ ను పొదుపుగా వాడుకోవాలని మంత్రి తెలిపారు.

ఈ పర్యటనలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, అధికారులు, తదితరులు ఉన్నారు.

## టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల కేసు.. ముగ్గురు అరెస్టు

జైపూర్ నటుడు టైగర్ ష్రాఫ్ పై కాల్పులు జరిపిన ముగ్గురిని పోలీసులు రాజస్థాన్‌లోని కోటా రైల్వే స్టేషన్‌లో అరెస్టు చేసారు.
నిందితుల్లో ఇద్దరు హర్యానాకు, మరొకరు బీహార్‌కు చెందినట్లుగా గుర్తించారు. ఈ నిందితులకు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధాలు ఉన్నాయని పోలీసులు వెల్లడించారు. ష్రాఫ్‌పై కాల్పులు జరిపింది.. ప్రొఫెషనల్ షూటర్లేనని మీడియాకు అధికారులు తెలిపారు. కాల్పులకు ముందు నటుడి కదిలికలను రెక్కీ చేసి.. దాడి నిర్వహించినట్లు సమాచారం. టైగర్ ప్రతి ఆదివారం జుహు ఫుట్‌బాల్ గ్రౌండ్‌కి వెళ్తాడని తెలుసుకున్న దుండగులు, అక్కడి నుంచి కారులో తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో కాల్పులు జరిసారు. తర్వాత అంధేరి వెస్ట్ రైల్వే స్టేషన్ వద్ద బైక్ వదిలి.. బోరివలి వైపు వెళ్లే ట్రైన్ ఎక్కారు. ఆపై మహారాష్ట్ర సరిహద్దు దాటి, గుజరాత్‌లోకి ప్రవేశించినట్లు గుర్తించారు.
అక్కడి నుంచి రాజస్థాన్‌లోని కోటాకు రైలులో వెళ్లగా, పోలీసులు స్టేషన్‌లో పట్టుకున్నారు.

# ఓయూలో కట్టమైసమ్మ అమ్మవారి ఆలయంపై దాడి..

## 24 గంటల్లో నిందితులను అరెస్ట్ చేయాలి..

## లేకుంటే డీజీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తాం: జీవన్

ఉస్మానియా యూనివర్సిటీలోని మోయిన్ చెరువు సమీపంలో ఉన్న కట్టమైసమ్మ అమ్మవారి ఆలయ గేట్లను ధ్వంసం చేసి, అమ్మవారి విగ్రహం, హారతి సామగ్రి, గంటలు, నైవేద్య పాత్రలను అపహరించినట్లు వస్తున్న సమాచారం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు జీవన్ అన్నారు. ఈ ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి, వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని, బాధ్యులను వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనకు సంబంధించిన ఫోటోలను బయటకు రాకుండా అడ్డుకుంటున్నారనే ఆరోపణలపై కూడా స్పష్టత ఇవ్వాలని కోరారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో దేవాలయాలకు, విద్యార్థుల విశ్వాసాలకు రక్షణ కల్పించడం అధికారుల బాధ్యతని పేర్కొన్నారు. ఈ ఘటనపై పారదర్శక విచారణ జరిపి,



నిజానిజాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కట్టమైసమ్మ అమ్మవారి ఆలయాన్ని ధ్వంసం చేసిన ఘటనలో నిందితులను 24 గంటల్లో గుర్తించి అరెస్ట్ చేయకపోతే, ఉస్మానియా యూనివర్సిటీ నుంచి వేలాది మంది విద్యార్థులతో డీజీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని జీవన్ పోలీసులను హెచ్చరించారు.

## విజయదశమి అందరికి విజయాలు చేకూర్చాలి

## జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల.. విజయదశమి పండుగ ప్రజలకు అన్ని రంగాలలో విజయం చేకూర్చాలని ఎస్పీ అశోక్ కుమార్ ఆకాంక్షించారు. ఈరోజు జిల్లా పోలీసు కార్యాలయంలోని ఆర్ముడు రిజర్వ్ విభాగంలో ఆయుధ పూజ, వాహన పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ దుర్గా దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయదశమి పర్వదినోత్సవం అందరికి సుఖ సంతోషాలు కలిగించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు మరియు పోలీస్ అధికారులకు సిబ్బందికి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

# దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ములుగు జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆయుధ పూజ

## జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామ్నాథ్ ఐపీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 19** ఎస్పీ కార్యాలయంవిజయదశమి (దసరా) పర్వదినాన్ని పురస్కరించుకుని ములుగు జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామ్నాథ్ ఐపీఎస్ ఆధ్వర్యంలో ఆయుధ పూజ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా పోలీస్ శాఖ విధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాలు, పోలీసు వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం సేవలందించే పోలీసు సిబ్బంది క్షేమంగా ఉండాలని, జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పోలీసు సిబ్బంది నిరంతరం కృషి చేయాలని సూచించారు. పండుగల



సమయంలో ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో వేడుకలు జరుపుకునేలా పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉంటుందని తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ తరఫున ఎస్ పి గారు జిల్లా ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఏఎస్ పి ఏటూరునాగారం మనన్ భట్ ఐపీఎస్, అదనపు ఎస్పీ సదానందం, డీఎస్పీ డీసీఆర్‌బీ కిషోర్ కుమార్, ములుగు డీఎస్పీ నలువాల రవీందర్, ములుగు సీఐ దారం సురేష్, ఆర్ఐ అడ్మిన్ స్వామి, ఆర్ఐ ఆపరేషన్స్ తిరుపతి, ఆర్ఐ ఎంటీవో వెంకటనారాయణ, ఆర్ఐ హోంగార్డ్స్ అండ్ వెల్ఫేర్ శ్రీకాంత్, ములుగు ఎస్ఐ వెంకటేశ్వర్లు, వెంకటాపురం ఎస్ఐ చల్లా రాజు,ఎస్ ఐ తాజుద్దీన్,ఎస్ఐ కృష్ణ ప్రసాద్, ఇతర ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కచ్చిరి కాడి ముచ్చట్లు

## కచ్చిర్ కాడి జనం ఈరోజు ఏజెండా
## ప్రతి పనికి వేలిముద్ర తప్పనిసరి
## ఓటుకు మాత్రం ఎందుకు కాదు?

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 19 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:**ప్రభుత్వ పథకాల నుంచి ప్రతి పనికీ వేలిముద్ర అడుగుతున్న పాలకులు, ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు, విషయంలో మాత్రం వేలిముద్రవిధానంఎందు కు అమలు చేయడం లేదు? ఓటు పవిత్రత, పారదర్శకతపై ప్రజలకు ఉన్న సందేహాలకు పాలకులు సమాధానం చెప్పాలి,ప్రజల ప్రశ్న ఒక్కటే, ప్రతి పనికీ వేలిముద్ర అవసరమైనప్పుడు, ఓటుకు ఎందుకు అవసరం లేదు చెప్పాల్సింది చాలా ఉంది,చదవాల్సింది మిగిలే ఉంది



# మహిషాసుర మర్దిని గా అవతారం ఎత్తిన అమ్మోరు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 19** ఏటూరు నగరం మండల కేంద్రంలోని ప్రసిద్ధ సీతారామచంద్ర ఆలయంలో నెలకొల్పిన అమ్మవారి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా తొమ్మిదవ రోజు మహిషాసుర మర్దిని అవతారమెత్తిన అమ్మోరు అమ్మోరు అగ్ర ఆవేశంలోనున్న తల్లిని చూడడానికి రెండు కనులు చాలా లేదు అమ్మోరు చేతిలో త్రిశూలం అమ్మవారి కాలు కింద మహిషాసురుడిని వధిస్తూ కనబడుతున్న విగ్రహాన్ని చూసి భక్తులు పరవశంతో కేరింతలు చేశారు దేవాలయం అంత అమ్మవారి నామ స్మరణతో మార్మోగిపోయింది ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున మహిళా మణులు మాల ధారణ భవాని చాలామంది పెద్ద ఎత్తున గుడికి చేరుకొని మాత తీర్థప్రసాదాలు సేకరించారు

# తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక

## ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్.
## బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే మట్టా రాగమయి సందడి!
## మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన సత్తుపల్లి ఎమ్మెల్యే

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 19:**తల్లాడ పట్టణంలోని మల్లారం రోడ్డులో గల బొడ్డు నరసింహులు ప్రాంగణంలో మాజీ సర్పంచ్ బొడ్డు శ్రీలత ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ముఖ్య అతిథిగా హాజరై మహిళలతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ఆడబిడ్డల ఐక్యతకు, ఆత్మగౌరవానికి ప్రతిరూపమని అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, బతుకమ్మ పండుగను ఐకమత్యంతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని పిలుపునిచ్చారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో మహిళలు పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ సందడి చేయడంతో ప్రాంగణమంతా పండుగ శోభను సంతరించుకుంది. ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మహిళలతో కలిసి వేడుకల్లో పాల్గొనడంతో సంబరాలు మరింత ఉత్సాహంగా సాగాయి. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బతుకమ్మ కమిటీ సభ్యులు మొక్క వెంకటలక్ష్మి, మొక్క శంకరీ,మొక్క సీత ప్రత్యేక చొరవ చూపారు. వారి సమన్వయంతో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ మండల అధ్యక్షులు గొడుగునూరు లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు బొడ్డు వెంకటేశ్వర్లు, పి. నాగేశ్వరావు (108), బొడ్డు రామ లక్ష్మణ్, బొడ్డు చిన్న నరసింహులు, ధూపాటి. శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు



# తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే పండుగ బతుకమ్మ పండుగ తలసాని శ్రీనివాస్ యాదవ్




**సనత్ నగర్ (ప్రజాబలం ప్రతినిధి నరేష్) అక్టోబర్ 19** తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే పండుగ బతుకమ్మ పండుగ అని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బతుకమ్మ వేడుకలలో భాగంగా ఆదివారం రాత్రి నెక్లెస్ రోడ్ లోని కర్బలా మైదానంలో మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు వేలాది మంది మహిళలు తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో కర్బలా మైదానం కు వచ్చారు. బతుకమ్మ పాటలు, ఆడపడుచుల ఆటలతో నెక్లెస్ రోడ్ పరిసరాలు ఎంతో కోలాహలంగా మారాయి. పాటలకు ధీటుగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మహిళలతో కలిసి బతుకమ్మ, దాండియా ఆడారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ గతంలో కన్నా విభిన్నంగా మాస్ డ్యాన్స్ తో అదరగొట్టారు. మహిళలు, యువతులు సైతం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తో కలిసి స్టెప్పులు వేశారు. రంగురంగుల లైట్ల వెలుతురులో, బతుకమ్మ, పోక్ సాంగ్స్ కు అనుగుణంగా మహిళలు, యువతులు, చిన్నారులు ఎంతో ఉత్సాహంగా అర్ధరాత్రి దాటే వరకు బతుకమ్మను ఆడారు. వేడుకలలో మాజీ కార్పొరేటర్ లు అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, అత్తిలి అరుణ గౌడ్, టి. మహేశ్వరి, బి ఆర్ ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, ఆకుల హరికృష్ణ, వెంకటేషన్ రాజు, నాయకులు తలసాని స్కైలాబ్ యాదవ్, గందె నాగులు, కిషోర్, శ్రీహరి, కోటేశ్వర్ గౌడ్, భువనగిరి కిరణ్ గౌడ్, రాంమోహన్ యాదవ్, ధరం చౌదరి, శ్రీకాంత్, టీనా గౌడ్, ఆరీఫ్, కొత్తూరు వెంకట్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.



# చెడుపై మంచి విజయానికి ప్రతీక విజయదశమి

## దుర్గామాత ఆశీస్సులతో అందరికీ శుభం కలగాలి
## జిల్లా ప్రజలకు కలెక్టర్ దసరా శుభాకాంక్షలు

**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, అక్టోబర్ 19:**విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఐఏఎస్ హృదయపూర్వక దసరా శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు, సంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. దుర్గామాత ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. ప్రజలంతా దసరా పండుగను శాంతియుత వాతావరణంలో, ఆనందోత్సాహాలతో, సోదరభావంతో జరుపుకోవాలని, ప్రతి ఒక్కరి అడుగులో విజయం చేకూరాలని కలెక్టర్ ఆకాంక్షించారు.



# మంచిర్యాల కాంగ్రెస్ లో గ్రూపు ఘర్షణలు

మంచిర్యాల సద్దుల బతుకమ్మ వేళ.. స్థానిక కాంగ్రెస్ నాయకులు రెండు గ్రూపులుగా విడిపోయి కొట్టుకున్నారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం తాళ్ళపేట గ్రామంలో ఘటన జరిగింది. గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకలు జరుగుతుండగా కాంగ్రెస్ గ్రూపుల మధ్య ఘర్షణ చెలరేగింది. ప్రేమ్ సాగర్ రావు, జగన్ మోహన్ రావు వర్గాల మధ్య వివాదం నెలకొంది. మాటామాటా పెరిగి ఘర్షణ చోటు చేసుకోవడంతో ఇరువర్గాలు కొట్టుకున్నాయి. ఈ కొట్లాటలో పలువురు మహిళలకు కుడా గాయాలు అయ్యాయి. వారిని సమీప ఆస్పత్రులకు తరలించారు. పోలీసులు వచ్చి ఇరువర్గాలను చెదరగొట్టారు.

# మైదుకూరు మున్సిపాలిటీ ఎన్నికలు వాయిదా

కడప మైదుకూరు మున్సిపాలిటీ ఎన్నికలు ఎన్నికల కమిషన్ వాయిదా వేసింది. కలెక్టర్ నివేదిక ఆదారంగా ఎన్నికల కమిషన్ వాయిదా వేసింది. నామినేషన్ సెంటర్లలో అభ్యర్థుల నామినేషన్ పత్రాలు చించినట్టు సిసి ఫుటేజీలు నిర్ధారించాయి. నామినేషన్ పత్రల పరిశీలన చేయడానికి వీలుకాదని ఎన్నికల కమిషన్ కు జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ రిపోర్టు రాసారు. కలెక్టర్ రిపోర్టర్ ను బేస్ చేసుకుని ఎన్నికలను ఎన్నికల కమిషన్ వాయిదా వేసింది.

## ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ లో ఉంచొద్దు: కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ఐడీఓసీ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి,అధికారులతో కలిసి ప్రజల నుంచి 44 అర్జీలు స్వీకరించారు. అత్యధికంగా కరీంనగర్ నగరపాలికకు 19 దరఖాస్తులు వచ్చాయి.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..సోమవారం కల్లా శాఖల లాగిన్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.వచ్చే సోమవారం నుంచి మొదటి గంటలో పెండింగ్ దరఖాస్తులను ప్రత్యక్షంగా పరిశీలిస్తానని.. ఈ లోగా అధికారులు లాగిన్ లో ఉన్న దరఖాస్తులను క్లియర్ చేయాలని సూచించారు. కలెక్టరేట్ సూపరింటెనీడెంట్లు కాళీ చరణ్, మాధవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పూలతో పులకించిన బతుకమ్మ సంబరాలు

## సద్దుల బతుకమ్మతో పండుగ వేడుకలకు పతాక స్థాయి ముగింపు

## మండలంలో బతుకమ్మ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రాగమయి దయానంద్

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 19:** ఆదివారం బతుకమ్మ వేడుకల్లో భాగంగా తల్లాడ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో తల్లాడ మండలంలోని పలు గ్రామాల్లో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు



బిల్లుపాడు గ్రామంలో

ఆదివారం బతుకమ్మ వేడుకల్లో భాగంగా బిల్లుపాడు గ్రామంలో తల్లాడ మండలం



కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్కంపూడి కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు ముఖ్యఅతిథిగా సత్తుపల్లి శాసనసభ్యురాలు ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా బిల్లుపాడు విచ్చేసిన ఎమ్మెల్యే రాగమయి దయానంద్కి గ్రామ ప్రజలు మహిళలు, యువకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు అనంతరం మహిళలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్,ఉప సర్పంచ్ గ్రామ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

అన్నారుగూడెం గ్రామంలో

ఆదివారం అన్నారుగూడెం గ్రామంలో మాజీ సర్పంచ్ మారెళ్ళ మమత మల్లికార్జున రావు,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుమ్మలపల్లి రమేష్ సత్యవతి తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు తాళ్ల జోసెఫ్ సాయిబాబా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సాయిబాబా మందిరం దగ్గర ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకలకు ముఖ్యఅతిథిగా సత్తుపల్లి సభ్యురాలు మట్ట రాగమయి దయానంద్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా అన్నారుగూడెం గ్రామంలో ఎమ్మెల్యే రాగమయి దయానంద్ కి గ్రామ మహిళలు కార్యకర్తలు నాయకులు ఘన స్వాగతం పలికారు.అనంతరం మహిళలతో కలిసి బతకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు ఎమ్మెల్యే రాకతో గ్రామం లో పండగ వాతావరణం నెలకొంది. గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు,ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే రాఘమయి దయానంద్ ని ఘనంగా సన్మానించారు అనంతరం తొమ్మిది రోజులు బతకమ్మ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులకు బహుమతులు ప్రధానం చేశారు.

అన్నారుగూడెం రామాలయం దగ్గర అన్నారుగూడెం రామాలయం దగ్గర జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి గోవింద్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బతుకమ్మ వేడుకలకు ముఖ్య అతిథిగా సత్తుపల్లి శాసనసభ్యులు మట్టా రాగమయి దయానంద్ పాల్గొన్నారు.అనంతరం మహిళలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గోవిందు శ్రీనివాసరావు ఎమ్మెల్యే రాఘమయి దయానంద్ ని ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమం లో అన్నారుగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మహిళలు చిన్నారులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

తల్లాడలో

తల్లాడ మేజర్ పంచాయతీ బొడ్రాయి బజార్ నాలుగో వార్డ్ లో కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుమలగిరి నారాయణమ్మ అప్పారావు మరియు బతుకమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మరియు తల్లాడ టౌన్ అధ్యక్షుడు దగ్గుల భద్రారెడ్డి ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ బొడ్డు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వివిధ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రాగమయి మహిళలు చిన్నారులు యువకులతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు

పినపాకలో

పినపాక గ్రామంలో సర్పంచ్ గుర్రం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బతుకమ్మ వేడుకలకు ఆదివారం ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రాగమయి దయానంద్ పాల్గొన్నారు బతుకమ్మ వేడుకలకు విచ్చేసిన ఎమ్మెల్యే రాఘమయి దయానంద్ కి గ్రామ ప్రజలు మహిళలు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు అనంతరం మహిళలతో చిన్నారులతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు అనంతరం సర్పంచ్ గుర్రం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు అనంతరం ఎమ్మెల్యే రాఘమయి దయానంద్ ని శాలువాలతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో పినపాక గ్రామ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మహిళలు చిన్నారులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతికి సాంప్రదాయ పండుగ బతుకమ్మ

## మాజీ వార్డు సభ్యురాలు మంచాల రాణి.



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 19:** ఆదివారం జరిగిన బతుకమ్మ వేడుకలు మాజీ వార్డు సభ్యులు మంచాల రాణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని చెరువు కట్టా బజారులో నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు మంచాల రాణి హాజరై బతుకమ్మ తెలంగాణ సాంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తుందని, ఆడబిడ్డల ఐక్యతకు ఆత్మగౌరవానికి ప్రతిరూపం బతుకమ్మ అని, తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బతుకమ్మ పండుగను ఐక్యమత్యంతో ప్రతి సంవత్సరం ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన బ్రతక మహోత్సవాలను అందరితో కలిసి నృత్యాలు చేస్తుంది బతుకమ్మను నిమజ్జనం చేశారు.



## ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

### నవంబర్ 3న పోలింగ్.. 5న ఓట్ల లెక్కింపు

ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ రెండో సాధారణ ఎన్నికలు 2026 నిర్వహణకు సంబంధించి ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. అక్టోబర్ 21 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుండగా, నవంబర్ 3న పోలింగ్ నిర్వహించనున్నారు. నవంబర్ 5న ఓట్ల లెక్కింపు చేపట్టి, ప్రక్రియ పూర్తయిన వెంటనే ఫలితాలను ప్రకటించనున్నారు.ఎన్నికల షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 21న ఎన్నికల నోటీసు జారీ చేయడంతో పాటు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తారు. అక్టోబర్ 23న సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. అక్టోబర్ 24న నామినేషన్ల పరిశీలన నిర్వహిస్తారు.తిరస్కరించిన నామినేషన్లపై అక్టోబర్ 25న అప్పీలు చేసుకోవచ్చు. అక్టోబర్ 26న అప్పీళ్లను పరిష్కరిస్తారు. అక్టోబర్ 27న మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థిత్వాల ఉపసంహరణకు గడువు ఉంటుంది. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు.

# వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

## వైద్య ఆరోగ్యశాఖలో 120 ఉద్యోగాలు

## 23 నుంచి దరఖాస్తుల స్వీకరణ.. రూ.15,600 నుంచి రూ.52 వేల వరకు వేతనం

**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, అక్టోబరు 19:** జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో జాతీయ ఆరోగ్య మిషన్ , పట్టణ జాతీయ ఆరోగ్య మిషన్ తదితర పథకాల కింద 16 కేటగిరీల్లో 120 పోస్టుల భర్తీకి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. కె. ఆనంద్ నోటిఫికేషన్ విడుదల చేశారు. మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు తదితర పోస్టులను కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నారు. పోస్టులను బట్టి నెలకు రూ.15,600 నుంచి రూ.52,000 వరకు వేతనం చెల్లిస్తారు.




ఈ నెల 23 నుంచి 28 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఆదివారం మినహా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు దరఖాస్తులను జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కార్యాలయం, ఎఫ్-1, ఐడీఓసీ భవనం, అంతాయిపల్లి, శామీర్‌పేటలో సమర్పించాలి. దరఖాస్తుతో పాటు రూ.500 డిమాండ్ డ్రాఫ్ట్, అవసరమైన ధ్రువపత్రాలు జతచేయాలి. అర్హతలు, దరఖాస్తు ఫారం, ఇతర నిబంధనల కోసం జిల్లా అధికారిక వెబ్‌సైట్ https://medchal-malkajgiri.telangana.gov.in ను పరిశీలించాలని డా. ఆనంద్ సూచించారు.

# శ్రీ జయదుర్గా మైసమ్మ దేవస్థానంలో శరన్నవరాత్రి విజయదశమి సందర్భంగా శ్రీ రాజ రాజేశ్వరిదేవి దర్శనంతో అమ్మవారి ఊరేగింపు





**హైదర్ నగర్ ( ప్రజాబలం ప్రతినిధి నరేష్) అక్టోబర్ 19** శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్స వాల్లో భాగంగా,శ్రీ జయదుర్గా మైసమ్మ (స్వయంభువు) దేవస్థా నంలో మహార్ణవమి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం అమ్మవారు శ్రీ మహాకాళి స్వరూ పంలో భక్తులకు దర్శనమిచ్చా రు.ఈ సందర్భంగా అమ్మవారిని సంప్రదాయబద్ధంగా వివిధరకాల పుష్పమాలలు,విశేష ఆభరణా లతో అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి దివ్యదర్శనాన్ని భక్తు లు భక్తిశ్రద్ధలతో స్వీకరించారు.

విజయదశమి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక కార్యక్ర మాలు మంగళవారం,విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ జయ దుర్గా మైసమ్మ తల్లి శ్రీ రాజరాజేశ్వరి దేవి స్వరూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

తదుపరి సంప్రోక్షణ,పూర్ణాహుతి ఉంటుంది.సాయంత్రం 5.00 గం టలకు అమ్మవారి ఊరేగింపు ప్రారంభం కానుంది.ఈ ఆధ్యాత్మి క కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారి దివ్యదర్శనం పొందుతూ, ఆమె కృపాకటాక్షాలకు పాత్రులు కావా లని దేవస్థాన నిర్వాహకులు విజ్ఞ ప్తి చేశారు.శరన్నవరాత్రి మహో త్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించనున్న విజయదశమి వేడుకల్లో భక్తులందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దేవస్థాన నిర్వాహకు లు కోరారు. అమ్మవారి అనుగ్ర హంతో ప్రజలందరికీ ఆయురారో గ్యాలు, సుఖసంతోషాలు,సర్వ శుభాలు కలగాలని ఆకాంక్షించిన ట్లు శ్రీ జయదుర్గ మైసమ్మ (స్వ యంభువు) దేవస్థానం కార్యని ర్వహణాధికారి సతీష్ బాబు స్పష్టం చేశారు.

# స్వర్ణకారుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి



రామాయంపేట మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో స్వర్ణకార సంఘం పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ చారి ఆధ్వర్యంలో స్వర్ణకారుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఈ నెల 24న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో నిర్వహించనున్న స్వర్ణకార సభ శంఖారావం పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మెదక్ జిల్లా స్వర్ణకార సంఘం ప్రధాన కార్యదర్శి సుంకోజు దామోదర్ చారి మాట్లాడుతూ స్వర్ణకారుల వృత్తి పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలిపారు.స్వర్ణకారులకు సంబంధించిన జీవో 272ను సవరించాలని అక్రమ రికవరీలను అరికట్టాలని పేర్కొన్నారు.50 ఏళ్లు నిండిన స్వర్ణకారులకు నెలకు రూ.5 వేల పెన్షన్ అందించాలని తెలిపారు.అలాగే అన్ని బ్యాంకుల్లో పనిచేస్తున్న అప్రైజర్లకు విధించిన సీలింగ్ విధానాన్ని తొలగించి సమానమైన కమిషన్ విధానాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు.స్వర్ణకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి వారి వృత్తి అభివృద్ధికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.స్వర్ణకారుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ నెల 24న సరూర్‌నగర్‌లో నిర్వహించనున్న స్వర్ణకార శంఖారావం బహిరంగ సభకు మెదక్ జిల్లాలోని స్వర్ణకార సంఘాల నాయకులు స్వర్ణకారులు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్వర్ణకార సంఘం కార్యదర్శి నెమలి శ్రీనివాస్ చారి రాష్ట్ర పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు కృష్ణాపురం రామకృష్ణ చారి స్వర్ణకార సంఘం కార్యదర్శి సరాఫ్ ప్రశాంత్ చారి పట్టణ స్వర్ణకార సంఘం ఉపాధ్యక్షుడు పూన రవీంద్ర చారి కోశాధికారి మైలవరం వేణుమాధవ్ చారి సహాయక కార్యదర్శి కిరణ్ చారి సహాయ ఉపకోశాధికారి వరుణ్ చారి మద్దూరి నవీన్ చారి సీనియర్ సభ్యులు వంగాల ముకుందా చారి వనపర్తి రమేష్ చారి నక్క నరేందర్ చారి రాయరపు శంకర్ చారి రాయరపు నాగరాజు చారి యాడారం రమేష్ చారి వనపర్తి ఆంజనేయులు చారి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి చేతుల మీదుగా వెలుగుమట్ల కాలనీ ప్రారంభోత్సవం

### నవంబర్ 8 నాటికి ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్ ప్యానెళ్ల ఏర్పాటు పూర్తి చేయాలి

### వెలుగుమట్ల కాలనీని పరిశీలించి మీడియా సమావేశం నిర్వహించిన మంత్రి తుమ్మల





**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 19:** డిసెంబర్ 9న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా వెలుగుమట్ల కాలనీ ప్రారంభోత్సవం చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.

సోమవారం వెలుగుమట్ల కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి మంత్రి పరిశీలించి, మీడియా సమావేశం నిర్వహించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వెలుగుమట్ల కాలనీలో నిర్మాణం ప్రారంభించిన 300 ఇళ్లను నవంబర్ 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి ఇంటి నిర్మాణ స్థితిగతులు, ప్రస్తుతం జరుగుతున్న పనులు, పూర్తికావాల్సిన పనులు, పనుల పురోగతితో కూడిన నివేదికను ప్రత్యేకంగా సిద్ధం చేసి జిల్లా కలెక్టర్‌కు సమర్పించాలని సూచించారు. ప్రతి రోజూ పనులను పర్యవేక్షిస్తూ, ప్రతి మూడు రోజులకు ఒకసారి పురోగతి నివేదికను కలెక్టర్‌కు అందించాలన్నారు.

అన్ని ఇళ్లను ఒకే నమూనాలో, ఆకర్షణీయంగా నిర్మించాలని, ఒకే రంగులో తీర్చిదిద్దాలని సూచించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి పగలు, రాత్రి పనులు కొనసాగించాలని ఆదేశించారు. అక్టోబర్ నెలాఖరులోగా అన్ని ఇళ్ల స్లాబుల నిర్మాణం పూర్తి చేయాలని, విద్యుత్ పనులను కూడా పూర్తిచేయాలని స్పష్టం చేశారు.

కాలనీలో అన్ని మౌళిక వసతులు ఒకేసారి పూర్తి చేయాలి:

ఇళ్ల నిర్మాణంతోపాటు రహదారులు, డ్రైనేజీలు, ఎనిమిది దుకాణాలతో కూడిన షాపింగ్ కాంప్లెక్స్, బస్తీ దవాఖానా, కమ్యూనిటీ హాల్, అంగన్‌వాడీ కేంద్రం తదితర మౌళిక వసతుల పనులను కూడా నవంబర్ 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. అన్ని పనులను సమాంతరంగా చేపట్టాలని, ఏ పనిలోనూ జాప్యం జరగకుండా చూడాలన్నారు. కాలనీలోని ప్రతి ఇంటికి త్రాగునీటి పైపులైన్ ఏర్పాటు చేసి, ఇంటి వద్దనే త్రాగునీటి కుళాయి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కాలనీకి అవసరమైన రహదారులను నిర్మించాలని సూచించారు. మున్సిపల్ కమీషనర్ ప్రతి మూడు రోజులకు ఒకసారి కాలనీని సందర్శించి పనుల నాణ్యత, పురోగతిని స్వయంగా పరిశీలించాలని ఆదేశించారు. అన్ని సౌకర్యాలతో వెలుగుమట్ల కాలనీని ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు.

దీపావళి నాటికి సోలార్ రూఫ్‌టాప్ ప్యానెళ్ల ఏర్పాటు

కాలనీలోని ప్రతి ఇంటిపై సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని మంత్రి తెలిపారు. ఇందుకు అవసరమైన అనుమతులను ఇంధన శాఖ కార్యదర్శి ద్వారా పొందేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నవంబర్ 8వ తేదీ దీపావళి నాటికి సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు సంబంధించిన పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. వెలుగుమట్ల కాలనీని డిసెంబర్ 9వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేనాటికి కాలనీలోని అన్ని ఇళ్లు, రహదారులు, డ్రైనేజీలు, ఇతర మౌళిక వసతులు అందుబాటులోకి రావాలని స్పష్టం చేశారు. కాలనీకి సంబంధించిన పేరును ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం సందర్భంగా ప్రకటిస్తారని తెలిపారు. గతంలో ఇక్కడ జరిగిన పరిణామాలను వివరిస్తూ, పేదల పేరుతో కొంతమంది భూములను ఆక్రమించేందుకు ప్రయత్నించారని, కోర్టు నిర్ణయం ప్రకారం జిల్లా యంత్రాంగం ఆక్రమణలను తొలగించిందని మంత్రి వివరించారు. అదే ప్రాంతంలో మోసపోయిన పేదలకు శాశ్వత నివాసాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఇందులో భాగంగా అర్హులను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు వివరించారు.

పేదలకు న్యాయం చేస్తూ ఆదర్శ కాలనీగా, వెలుగుమట్ల కోట్లాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన కాలనీల్లో ఎలాంటి సౌకర్యాలు ఉంటాయో, అలాంటి సదుపాయాలన్నింటినీ వెలుగుమట్లలోని పేదలకు ప్రభుత్వం కల్పిస్తుందని మంత్రి తెలిపారు. ఇళ్లతోపాటు రహదారులు, డ్రైనేజీలు, బస్తీ దవాఖానా, అంగన్‌వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్ వంటి సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు.

పేదలకు న్యాయం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం వెలుగుమట్లలో ఆదర్శవంతమైన కాలనీని నిర్మిస్తోందని అన్నారు.

గతంలో జరిగిన దోపిడీని ప్రజలకు తెలియజేయడంతో పాటు, ప్రస్తుత ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం చేస్తున్న కార్యక్రమాలు, వారికి కల్పిస్తున్న సదుపాయాలను కూడా ప్రజలకు స్పష్టంగా వివరించాలని మంత్రి సూచించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ పాలనకు ప్రాధాన్యం:

తెలంగాణ రాష్ట్రంలో పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం భారీ స్థాయిలో నిధులు ఖర్చు చేస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కూడా తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాల స్థాయిపై ఆసక్తి వ్యక్తమవుతోందని, ఇటీవల తమిళనాడు పర్యటన సందర్భంగా అక్కడి వారు తెలంగాణలో ఇన్ని సంక్షేమ పథకాలను ఎలా అమలు చేయగలుగు తున్నారని ఆశ్చర్యం వ్యక్తం చేశారని తెలిపారు. పేదల సంక్షేమాన్ని ప్రధాన ఎజెండాగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని మంత్రి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ప్రజాప్రతినిధులు రాయల నాగేశ్వరరావు, దీపక్ చౌదరి, కమర్తపు మురళి, కిషోర్, సాధు, ఇతర ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మణికంఠ క్షేత్రం ఆలయాన్ని సందర్శించిన సండ్ర వెంకట వీరయ్య

### ఆలయంలో ప్రత్యేక పూజలు



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 19:** తల్లాడ మండలం నూతనకల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ శివగిరి మణికంఠ క్షేత్రం ఆలయాన్ని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సత్తుపల్లి మాజీ శాసన సభ్యులు జననేత సండ్ర వెంకట వీరయ్య సోమవారం ఉదయం సందర్శించారు.

ఆలయంలో కొబ్బరి కాయ కొట్టి ప్రత్యేక పూజలు అందుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయం దిన దినం అభివృద్ధి చెందాలని, స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపైన ఉండాలని కోరుకున్నారు.

ఈ సందర్భంగా విచ్చేసిన సండ్ర వెంకట వీరయ్యకి ఆలయ అర్చకులు, స్వాములు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శాలువ కప్పి సన్మానించారు. అదేవిధంగా

ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఘన స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో తల్లాడ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రెడ్డెం వీర మోహన్ రెడ్డి, తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, తల్లాడ టౌన్ అధ్యక్షులు జీవిఆర్, నూతనకల్ మాజీ సర్పంచ్ తూము శ్రీనివాసరావు, వైరా మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నాయుడు శ్రీనివాసరావు, అన్నారుగూడెం సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, రంగం బంజర మాజీ సర్పంచ్ లింగా , జోనల్ చైర్మన్ కేతినేని చలపతిరావు, తెలగవరం బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మువ్వా మురళి, దగ్గుల రాజశేఖర్ రెడ్డి, పసుపులేటి ప్రభాకర్, కిన్నెర శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, గణేషుల రమేష్, కళ్యాణపు కృష్ణయ్య, చారి, నాయుడు అప్పారావు, వెంకటేష్, మరియు ముఖ్య నాయకులు కార్యకర్తలు యువత పాల్గొన్నారు.

## పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు ఘనంగా ఆయుధ పూజ, వాహన పూజ వేడుకల్లో పాల్గొన్న జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 19:** దుర్గామాత నవరాత్రులలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా హేమచంద్రపురంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఆయుధ పూజ, వాహన పూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐపీఎస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు.



ఆయుధ పూజ కార్యక్రమంలో భాగంగా పోలీస్ శాఖ విధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాలను ప్రత్యేకంగా అలంకరించి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. ఆయుధ పూజ మన సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో ఆయుధాలు కీలక పాత్ర పోషిస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఆయుధాల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, క్రమశిక్షణ, అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

అనంతరం పోలీస్ వాహనాలకు వాహన పూజ నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అత్యవసర సమయాల్లో ప్రజలకు తక్షణ సేవలు అందించడంలో కీలక పాత్ర పోషించే పోలీస్ వాహనాలను ఎప్పటికప్పుడు సక్రమమైన స్థితిలో ఉంచాలని సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ వేడుకలను పురస్కరించుకుని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్వయంగా పాల్గొని పోలీస్ అధికారులు, సిబ్బందికి అన్న ప్రసాదాలను వడ్డించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, సీఐలు, ఆర్‌ఐలు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### రాష్ట్ర ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు

అమరావతి రాష్ట్ర ప్రజలకు సీఎం చంద్రబాబు దసరా శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక.. దసరా. మా పాలనలో రైతన్న శ్రమకు తగిన ఫలితం ఇస్తున్నాం. మహిళలకు సాధికారత.. యువతకు బంగారు భవిష్యత్తు అందించేందుకు కృషి చేస్తున్నాం. మా ప్రభుత్వ సంకల్పానికి జగన్మాత అనుగ్రహం ఉండాలని ప్రార్థిస్తున్నా. దుర్గమ్మ ఆశీస్సులతో మన రాష్ట్రం అన్ని రంగాల్లో విజయాలు సాధించాలని అన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com